తిరుపతి, నందిగామ టిడిపి కైవసం

- తిరుపతిలో టిడిపి అభ్యర్థిని గెలిపించిన వైసిపి కార్పొరేటర్లు
- పాలకొండలో గైర్హాజరైన వైసిపి కౌన్సిలర్లు
- కాకినాడ జిల్లా తునిలో ఎన్నికను అడ్డుకున్న టిడిపి నాయకులు

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 184 | విజయవాడ, బుధవారం 5 ఫిబ్రవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 5 February 2025 | Rs



ఆంధ్రకు మరో రెండు కాంస్య పతకాలు

38వ జాతీయ క్రీడలు

8



ప్రణాళిక శాఖ అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ఉగాది నుంచి పి-4

ప్రారంభ కార్యక్రమానికి ఎన్ఆర్ఐలు

జిల్లాల వారీగా విజన్ - 2047

సమీక్షలో చంద్రబాబు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన పి-4 (పబ్లిక్-ప్రయివేటు-పీపుల్స్ పార్టనర్‌షిప్) విధానాన్ని ఉగాది నుండి అమలులోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పి4, విజన్- 2047లపై ఆయన మంగళవారం ప్రణాళిక శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి-4 అమలుకు అవసరమైన సన్నాహాలు చేస్తూనే జిల్లాల వారీగా 'విజన్ -2047'ను ఆచరణలోకి తీసుకురావాల్సిఉంటుందని అన్నారు. కీలకమైన ఈ రెండు అంశాలపై క్షేత్రస్థాయి వరకు అధికారయంత్రాంగం దృష్టి సారించాలని చెప్పారు.

పి-4 గురించి మాట్లాడుతూ పేదరిక నిర్మూలనలో భాగంగానే ఆ విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. పూర్తిస్థాయిలో విధి విధానాల రూపకల్పన కోసం ప్రజల నుండి సూచనలు, సలహాలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం ప్రత్యేకంగా ఒక పోర్టల్‌ను కూడా రూపొం దిస్తున్నట్లు చెప్పారు. ఈ సలహాలు, సూచనలు ఆధారంగానే పి-4 విధానాన్ని అమలు చేస్తామని అన్నారు. పేదలకు సాయం చేసేందుకు ఉన్నత స్థాయిలో ఉన్న పారిశ్రామిక వేత్తలు, ఎన్నారైలు ముందుకు వస్తున్నారని వివరించారు. ఇలా ముందుకు వచ్చే వారందర్ని ఉగాది రోజు జరిగే పి-4 ప్రారంభ కార్యక్రమానికి తాను స్వయంగా ఆహ్వానించనున్నట్లు తెలిపారు. అటువంటి వారందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా పి-4 అమలు చేస్తామన్నారు. ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్న పది శాతం మంది., పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడం లక్ష్యంగా ముందుకు సాగాలని చెప్పారు. పేదలను గుర్తించేందుకు ప్రత్యేకంగా ఒక సర్వేను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో ఆర్థిక, ప్రణాళికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రణాళిక శాఖ సంచాలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

హెటిరోలో విషవాయువు లీక్

- 12 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని హెటిరో డ్రగ్స్ కంపెనీలో మంగళవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో ప్రమాదం చోటుచేసుకుంది. విషవాయువు లీకవ్వడంతో 12 మంది ఉద్యోగులు అస్వస్థతకు గురయ్యారు. కంపెనీ అంబులెన్స్‌లో తొలుత వారిని నక్కపల్లిలోని 50 పడకల ఆసుపత్రికి తరలించారు. అనంతరం అక్కడి నుంచి ముగ్గురిని విశాఖకు తీసుకెళ్లారు. అస్వస్థతకు గురైన వారిలో కె.వీరబాబు, జి.గౌరి నాయుడు, జి.సుబ్రహ్మణ్యం, వై.శివ, వి.వరుణ్ కుమార్, జి.శివప్రసాద్, ఎ.వెంకటప్రసాద్, జి.రామకృష్ణ, జి.శ్రీనివాస్, బి.సతీష్, ఎం.దేవుడు, జి.దినేష్ ఉన్నారు. వీరిలో కె.వీరబాబు, జి.గౌరినాయుడు, జి.సుబ్రహ్మణ్యంలను మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు.

అసలేం జరిగింది ?

కంపెనీలోని హెచ్ 7, హెచ్ 8 బ్లాక్‌ల మధ్య యూనిట్ 9 వద్ద బి షిఫ్ట్‌కు చెందిన కెమిస్ట్ ఉద్యోగులు ఏడున్నర గంటల ప్రాంతంలో క్యాంటీన్‌లో భోజనం చేసేందుకు బ్లాక్ నుంచి బయటకు వచ్చారు. ఏదో వాసన వచ్చిందని, దగ్గు వచ్చి ఊపిరాడని పరిస్థితి నెలకొందని అస్వస్థతకు గురైన ఉద్యోగులు తెలిపారు. విషయం తెలుసుకున్న నక్కపల్లి, ఎస్.రాయవరం సిఐలు కుమారస్వామి, రామకృష్ణ నక్కపల్లి ఆస్పత్రికి చేరుకుని ప్రమాద ఘటనపై ఆరా తీశారు. రెవెన్యూ ఉద్యోగులు ప్రమాద ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. సోడియం హైపో క్లోరైడ్ లీక్ కావడంతో కంపెనీ ఉద్యోగులు స్వల్ప అస్వస్థతకు గురైనట్లు కంపెనీ ప్రతినిధి తెలిపారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో వరుస ప్రమాదాలపై వారు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీల్లో భద్రతా చర్యలు కొరవడ్డాయని, ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టిసారించాలని కోరారు. తాజా ప్రమాదంలో సమగ్ర విచారణ జరపాలన్నారు.



భారతీయులను గెంటేస్తున్న ట్రంప్!

205 మందితో భారత్‌కు బయలుదేరిన అమెరికా సైనిక విమానం

వెనక్కి రప్పించడానికి సిద్ధమంటూ విధేయత ప్రకటించిన భారత్

వాషింగ్టన్ : అధ్యక్షుడు ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పటి నుండి అమెరికాలో తగిన పత్రాలు లేకుండా నివసించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ, ఆగమేఘాల మీద వారిని స్వదేశాలకు పంపుతున్నారు. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద స్థాయిలో ఈ బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. ముందుగా మైగ్రెంట్లను సైనిక స్థావరాలకు తరలించి, అక్కడ నుండి వారిని మిలటరీ విమానాల్లో వారి దేశాలకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు గ్వాటెమాలా, పెరూ, హోండూరస్‌లకు మైగ్రెంట్లను తీసుకుని మిలటరీ విమానాలు వెళ్లాయి.

తాజాగా మంగళవారం కొంతమంది భారతీయులను తీసుకుని అమెరికా మిలటరీ విమానం బయలుదేరిందని సంబంధిత అధికారులు తెలిపారు. వీరిలో వీసా గడువు తీరినా కూడా అక్కడే వున్నవారు, లేదా సరైన పత్రాలు లేకుండా వెళ్లినవారు వున్నారని భావిస్తున్నారు. ఆ విమానంలో 205మంది భారతీయులు వున్నట్లు తెలుస్తోంది. సి-17 యుఎస్ మిలటరీ విమానంలో వీరిని తరలిస్తున్నారని, 24గంటల్లో భారత్‌కు చేరుకుంటారని పేరు చెప్పడానికి ఇష్టపడని అధికారి ఒకరు తెలిపారు. భారత్ దీనిపై స్పందించిన తీరు ఆశ్చర్యకరం. అమెరికాలోనే కాదు, ప్రపంచ దేశాల్లో ఎక్కడైనా సరే కాల పరిమితి కన్నా ఎక్కువ కాలం వుంటున్న వారిని వెనక్కి రప్పించడానికి తాము సిద్ధంగానే వున్నామని తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని పేర్కొంది.



ట్రంప్‌తో భేటీ కానున్న మోడీ : 12 నుండి మోడీ అమెరికా పర్యటన

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 12 నుండి 14వరకు అమెరికాలో పర్యటించను న్నారు. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ రెండోసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మోడీ జరపనున్న తొలి పర్యటన ఇదే. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ ఆధ్వర్యాన పారిస్‌లో ఈ నెల 10, 11 తేదీల్లో జరగబోయే ఎఐ కార్యాచరణ సదస్సుకు మోడీ తొలుత హాజరవుతారు. ఆ తర్వాత అక్కడ నుండి ఆయన వాషింగ్టన్‌కు వెళతారు. మూడు రోజుల పర్యటన ముగిసిన తర్వాత ఆయన ఢిల్లీ వస్తారని సంబంధిత వర్గాలు తెలిపాయి.



అదానీ అవినీతి ముమ్మాటికి నిజమే

- ఆ రిపోర్ట్‌కు కట్టుబడి ఉన్నాము..
- పత్రికల్లో చూసే పరిశోధించాము
- ఎవరి భయానికో ఏజెన్సీని మూసివేయలేదు
- హిండెన్‌బర్గ్ ఫౌండర్ ఆండర్సన్ వెల్లడి

3

కేంద్ర బడ్జెట్‌కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు

- రూపొందించిన వామపక్షాలు
- 14 నుండి 20 వరకు దేశవ్యాప్తంగా విస్తృత ప్రచారానికి పిలుపు

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌కు వామపక్షాలు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను రూపొందించాయి. వీటిని ఈ నెల 14వ తేది నుండి 20 వ తేది వరకు దేశ వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించాయి. సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్, ఆర్ఎస్‌పి, అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ నేతలు జరిపిన చర్చల్లో ఈ మేరకు నిర్ణయించారు. ఇంటింటికి తిరగడం, వీధి సమావేశాలు నిర్వహించడం, ప్రదర్శనలు, ర్యాలీలు ద్వారా దేశ వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలను కలుసుకోవాలని, సామూహిక ప్రచారంచేపట్టాలని నిర్ణయించారు. దీనికోసం అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని తమ రాష్ట్ర శాఖలకు ఆ పార్టీలు సూచించాయి. ఈ మేరకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, సమన్వయకర్త ప్రకాష్ కరత్, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఎఐఎఫ్‌బి ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్‌లు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 'ప్రజల తక్షణ, మౌలిక అవసరాలకు కేంద్ర బడ్జెట్ దారుణంగా ద్రోహం చేసింది. మూకుమ్మడి నిరుద్యోగం, వేతనాల కుంగుబాటు, ప్రజల్లో కొనుగోలు శక్తి కుంచించుకుపోవడం కారణంగా ఆర్థిక వ్యవస్థలో తగ్గిన డిమాండ్ సమస్యను పరిష్కరించడానికి బదులుగా మోడీ ప్రభుత్వం సంపన్నులకు మరిన్ని రాయితీలు ఇస్తోంది. ఖర్చుల్లో కోతలు పెడుతోంది.' అని వారు ఈ ప్రకటనలో పేర్కొన్నారు. సంపన్నులపై, బడా కార్పొరేట్ సంస్థలపై పన్నులు విధించడం, ఉపాధి కల్పనకు సాయపడేలా ప్రభుత్వ పెట్టుబడులను విస్తరించడం, కనీస వేతనాలకు హామీ కల్పించడం ద్వారా వనరులను సమీకరించడానికి బదులుగా అందుకు విరుద్ధమైన మార్గాన్ని ప్రభుత్వం ఎంచుకుందని విమర్శించారు. ప్రభుత్వం అనుసరించే ఈ విధానాల వల్ల కొద్దిమంది వద్దే సంపద పోగుపడుతుందని వారు తెలిపారు.

నిరుద్యోగాన్ని విస్మరించారు

నిరుద్యోగ సమస్యను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని వామపక్ష నేతలు తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆహార సబ్సిడీలు, వ్యవసాయం దాని అనుబంధ కార్యకలాపాలు, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం, పట్టణాభివృద్ధి రంగాలపై పెట్టే ఖర్చు గతేడాది కంటే బాగా తగ్గిపోయిందని పేర్కొ న్నారు. డిమాండ్ పెరిగినప్పటికీ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు రూ.86 వేల కోట్ల వద్దే నిలిపివేయడాన్ని ప్రస్తావించారు.

'ఆ' ఊరట కొద్దిమందికే ...

రూ.12లక్షలకు ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని పెంచడం వల్ల కొద్దిమందికి మాత్రమే ఊరట లభిస్తుందని వివరించారు. అదే సమయంలో ధరల పెరుగుదల, జిఎస్‌టి వంటి పరోక్ష పన్నులతో ఇబ్బందులు పడుతున్న కార్మిక వర్గంలోని విస్తృత ప్రజానీకాన్ని పూర్తిగా విస్మరించారని తెలిపారు. పన్ను మినహాయింపు పరిమితిని పెంచడం వల్ల ఎదురైన నష్టాన్ని సంపన్నులపై, కార్పొరేట్లపై అధికంగా పన్నులు విధించడం ద్వారా తగ్గించుకోవచ్చని వివరించారు. అయితే, ప్రభుత్వం అలా చేయకుండా కార్పొరేట్ రంగానికి, సూపర్ రిచ్ వర్గాలకు వరాల మూటను అందించింది.

'వాటి'ని తిరస్కరిస్తున్నాం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని ప్రజా వ్యతిరేక ప్రతిపాదనలన్నింటిని తాము తిరస్కరిస్తున్నట్లు వామపక్షనేతలు ప్రకటనలో తెలిపారు. వాటి స్థానంలో తాము సూచించే ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడం, ఉపాధి అవకాశాలను సృష్టించడం, వేతనాలు పెంచడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. తాము రూపొందించిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ప్రజల విద్యా హక్కుకు, మిగతా 7లో

అంపశయ్యపై ప్రభుత్వ విద్య

- ప్రాణప్రతిష్ట చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్రంలో ప్రభుత్వ విద్య అంపశయ్యపై ఉందని, ఈ ప్రమాదాన్ని గుర్తించి ప్రాణప్రతిష్ట చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. నెల్లూరులోని డాక్టరు రామచంద్రారెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో జరుగుతోన్న మార్పులు..తద్వారా రాబోయే ప్రమాదాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అయోధ్యలోని శ్రీరామునికి ప్రాణప్రతిష్ట చేయగలిగినటువంటి శక్తి కలిగిన మోడీ.. విద్యకు ప్రాణప్రతిష్ట చేయడం చేతకాని పనికాదన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో విద్యకు నాలుగు శాతం కోత విధించిందని విమర్శించారు. అతి త్వరలో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెడుతుందని, అందులో అయినా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కావాల్సిన నిధులు కేటాయించాలన్నారు. గత ప్రభుత్వం 117 జీఓను తీసుకొచ్చి విద్యావ్యవస్థను ఆరు ముక్కలు చేసి రాష్ట్రంలో గందరగోళ పరిస్థితిని కల్పించిందన్నారు. ప్రపంచ బ్యాంకుల షరతులకు లోబడి ప్రభుత్వ విద్యను కుదించే పనిచేస్తోందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల దాదాపు 20 వేల పాఠశాలలు సింగిల్ టీచర్ స్కూల్స్‌గా మారిపోతున్నాయని, విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో అనంతరం వాటిని మూసివేస్తారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 10వ తరగతి లోపు విద్యాబోధన చేసే పాఠశాలలు 20 శాతం మూతపడ్డాయన్నారు. దీని కారణంగా 30 వేల ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయని, పదవ తరగతిలోపు విద్యార్థులు 50 శాతం మంది కార్పొరేట్ పాఠశాలల్లో చేరిపోయారని తెలిపారు. తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకుండా టిడిపి కూటమిప్రభుత్వం వాయిదా వేయడం అనర్థదాయకమన్నారు. ఈ బడ్జెట్‌లో అయినా తల్లికి వందనం అమలు చేసేందుకు నిధులు కేటాయించి ఈ విద్యాసంవత్సరంలో అందజేయాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే నాటికి డిఎస్‌సి ప్రకటించి ఉపాధ్యాయ పోస్టుల భర్తీని పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రద్దు చేయడం విద్యార్థులకు ప్రస్తుతానికి బాగానే ఉన్నా రెండవ సంవత్సరం పరీక్షలకు సిద్ధం అయ్యే విద్యార్థులపై భారం ఎక్కువ అవుతుందన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యారంగం దారుణంగా ఉందని, 169 ప్రభుత్వ కళాశాలలు మాత్రమే ఉన్నాయన్నారు. ఎయిడెడ్ కళాశాలలు పూర్తిగా మూతపడ్డాయన్నారు. యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్ల మిగతా 7లో



కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చిస్తున్న లోకేష్ , రామ్మోహన్, పెమ్మసాని

విద్యకు ఎఐ సెంటర్ మా రాష్ట్రానికివ్వండి

- మంగళగిరిలో రైల్వే భూములను మాకు అప్పగించండి
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు మంత్రి లోకేష్ విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటు చేయాలని ఐటి, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. అలాగే డేటా సిటీల ఏర్పాటుకు సింగిల్ విండో అనుమతులివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ రైల్ భవన్‌లో కేంద్ర రైల్వే, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను లోకేష్ కలిశారు. రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధికంగా కేటాయింపులు చేశారంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, నూతనంగా తీసుకొచ్చిన పాలసీల గురించి కేంద్ర మంత్రికి లోకేష్ వివరించారు. ఎపిలో ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానంలో త్వరితగతిన అనుమతులు ఇవ్వడమే కాకుండా, ప్రాజెక్టులు త్వరితగతిన ఏర్పాటయ్యేలా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఎఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎడ్యుకేషన్ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయాలని లోకేష్ కోరారు. ఎఐతో రాబోతున్న అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని, ఇందుకు కేంద్ర ప్రభుత్వ మిగతా 7లో

గుడ్లు, మాంసంపై అపోహలొద్దు

- పశుసంవర్ధక శాఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోడి గుడ్లు, మాంసంపై ఎటువంటి అపోహలు అవసరం లేదని పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ టి దామోదరనాయుడు తెలిపారు. కోళ్ల మరణాలను దృష్టిలో ఉంచుకుని గుడ్లు, మాంసం వినియోగంపై లేనిపోని అపోహలు ప్రచారంలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కోడి గుడ్లు, మాంసం వినియోగించడం వల్ల ఎటువంటి ప్రాణహాని, మరే ఇతర ఆరోగ్య సమస్యలు సంభవించినట్లు ఏ సంస్థలు, శాఖలు ధ్రువీకరించలేదని తెలిపారు. రాష్ట్రంలో 8 కోట్ల కమర్షియల్ కోళ్లు, 2 కోట్ల పెరటి కోళ్లు ఉన్నాయని, ఇటీవల కాలంలో కోళ్ల మరణాలు రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో గమనించినట్లు పేర్కొన్నారు. ప్రజల్లో అపోహలు, ఆందోళనలను నివృత్తి చేయడానికి పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యాన ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి, అవగాహన కార్యక్రమాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పశువైద్యులు కోళ్ల నుంచి నమూనాలు సేకరించి రాష్ట్ర స్థాయి పశు వ్యాధి నిర్ధారణ కేంద్రానికి, భోపాల్‌లోని వ్యాధి నిర్ధారణ కేంద్రానికి పరీక్షల కోసం పంపామన్నారు.

విదేశీ కంపెనీలు దేశ భద్రతకు ముప్పు

- బీమాలో ఎఫ్‌డిఐ నిర్ణయాన్ని ఉపసంహరించకపోతే సమ్మెకు సిద్ధం
- రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఐసి ఉద్యోగుల నిరసనలు



రాజమహేంద్రవరంలో డివిజనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎల్ఐసి ఉద్యోగులు

ప్రజాశక్తి-యంత్రాంగం

బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ) పరిమితిని 74 నుంచి నూరు శాతానికి పెంచడాన్ని వ్యతిరేకిస్తూ ఎల్ఐసి ఉద్యోగులు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఎల్ఐసి కార్యాలయాల వద్ద నిరసనలు తెలిపారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో నిరసనలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు మాట్లాడుతూ.. బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని నూరు శాతానికి పెంచుతున్నట్టు ప్రకటించారని, ఆ నిర్ణయం భారతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అవసరమైన మూలధన సమీకరణపై తీవ్ర ప్రభావం చూపనుందని తెలిపారు. విదేశీ కంపెనీలు దేశ భద్రతకు, ప్రజల సమాచార గోప్యతకు ముప్పు అని తెలిపారు. కేంద్రం వెంటనే ఎఫ్‌డిఐ పెంపును విరమించుకోవాలని, ఎల్ఐసిని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో ఎఫ్‌డిఐని పెంచుతూ బీమా చట్ట సవరణ బిల్లు తీసుకువస్తే సమ్మెకైనా వెనుకాడబోమని హెచ్చరించారు. పాలసీ ప్రీమియాల మీద కేంద్ర ప్రభుత్వం విధించిన జిఎస్‌టిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో, ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ గవర్నర్‌పేటలో ప్రదర్శనలు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని ఎల్ఐసి కార్యాలయం వద్ద ఎల్ఐసి ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన, అనంతపురం జిల్లా రాయదుర్గం ఎల్ఐసి కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. విజయగనం జిల్లా విజయనగరం, గరివిడి ఎల్ఐసి కార్యాలయాల వద్ద నేతలు నిరసన తెలిపారు. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ధర్నా నిర్వహించారు. నూరుశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్ఆర్ జిల్లా కడపలోని డివిజనల్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను నేరుగా ఆహ్వానించడంతో బీమారం గానికి, పాలసీదారులకు మేలు చేయదని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఎల్ఐసి కార్యాలయం వద్ద బీమా ఉద్యోగులు ఏజెంట్లతో కలిసి ఆందోళన చేశారు.

ఈ రెండు నెలలు జాగ్రత్త

● ఆదాయం తగ్గనీయవద్దు ● అధికారులకు సిఎం సూచన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

'ఈ రెండు నెలలు జాగ్రత్త. ఆర్థిక సంవత్సరంలో ఇవి చివరి నెలలు. ఈ రెండు నెలల్లో ఆదాయం తగ్గితే దాని ప్రభావం వచ్చే ఆర్థిక సంవత్సరంపై కూడా పడుతుంది. అందువల్ల ఈ రెండు నెలలు జాగ్రత్త. ఆదాయం తగ్గకుండా చూడండి.' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులకు సూచించారు. ఆదాయం పెంపు మార్గాలపై కూడా దిశా నిర్దేశం చేశారు. ఆదాయ వనరుల శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం నుంచి రావాల్సిన నిధులపైనా ఆరా తీసారు. పలు శాఖల ద్వారా రావాల్సిన ఆదాయం, వచ్చిన ఆదాయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆర్థిక సమస్యలు రాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఆదాయవనరుల శాఖలు ఉత్తమ ఫలితాలు సాధించాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. ఇందుకోసం సరికొత్త ఆలోచనలు చేయాలని నిర్దేశించారు. సాధారణ పనితీరుతో, సాధారణ లక్ష్యాలతో ఫలితాలు రావని, వినూత్నంగా మాత్రమే ఆలోచనలు చేయాలని స్పష్టం చేశారు.

పన్ను ఎగవేతలపై దృష్టి

ఆదాయాన్ని నీరుగార్చే పన్నుల ఎగవేతపై దృష్టి సారించాలని చంద్రబాబు సూచించారు. ఒక్కరు కూడా ఎగవేతకు పాల్పడకుండా చూడాలని నిర్దేశించారు. అయితే ఈ సమయంలో వ్యాపారులను, ప్రజలను వేధించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను సక్రమంగా రాబట్టుకునేందుకు అనునిత్యం సంప్రదింపులు జరుపుతున్నామని, అధికారులు కూడా తమతమ శాఖలతో చర్చలు కొనసాగించాలని స్పష్టం చేశారు.

ఆదాయం 1,02,154 కోట్లు

ఈ ఏడాది రెవెన్యూ ఆదాయం 1,02,154 కోట్లు వస్తుందని అంచనా వేస్తున్నట్లు ఆర్థికశాఖ అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో వాణిజ్య పన్నుల ఆదాయం పెరిగే పరిస్థితి ఉంటుందని వారు తమ నివేదికలో పేర్కొన్నారు. కొత్త ఎక్సయిజ్ విధానం వల్ల కూడా కొంతవరకు ఆదాయం పెరుగుతుందన్న భావాన్ని అధికారులు వ్యక్తం చేశారు. గనుల శాఖలో మాత్రం ఆదాయం పెరుగుదల కనిపించలేదని వివరించారు.

ఈ సమీక్షలో ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అసెంబ్లీ ఫైనాన్స్ కమిటీలకు చైర్మన్ల నియామకం

● స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసన వ్యవస్థలో మూడు ఫైనాన్స్ కమిటీలకు ఛైర్మన్ల నియామకం పూర్తయినట్లు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ లెక్కల సమితి (పిఎసి) ఛైర్మన్‌గా రామాంజనేయులు పులివర్తి, ప్రభుత్వ రంగ సంస్థల సమితి (పియుసి) ఛైర్మన్‌గా కూన రవికుమార్, అంచనాల సమితి (ఇసి) ఛైర్మన్‌గా వేగుళ్ల జోగేశ్వరరావును నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర శాసనసభలోని 175 మంది సభ్యుల నుంచి 9 మంది, రాష్ట్ర శాసనపరిషత్తు 58 మంది సభ్యుల నుంచి ముగ్గురు చొప్పున ఆయా కమిటీల్లో సభ్యులుగా ఎన్నికయ్యారు.

రాష్ట్రంలో కులగణన చేపట్టాలి

● కాంగ్రెస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కులగణన విషయంలో బిజెపి ఉచ్చులో పడకుండా, రాష్ట్రంలో వెంటనే ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల మంగళవారం ప్రకటన విడుదల చేశారు. తెలంగాణలో ప్రభుత్వం చేపట్టిన కులగణన దేశానికి దిక్సూచిగా పేర్కొన్నారు. ఆ రాష్ట్ర జనాభాలో 56 శాతం బిసిలు, 17 శాతం ఎస్‌సిలు, 10 శాతం ఎస్‌టిలు అంటే దాదాపు 80 శాతం వెనుకబడిన, బలహీనవర్గాల ప్రజలే ఉండటం విస్మయపరిచిన అంశమన్నారు. రాష్ట్రంలో కూడా ఇదే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నట్లు చెప్పారు.

జనాభా ప్రాతిపదికన న్యాయంగా రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు కులగణన చేపట్టినా సిఎం జగన్ ఆ వివరాలను తొక్కిపెట్టారన్నారు. బిజెపి డైరెక్షన్‌లోనే సర్వే రిపోర్టు బయటకు పొక్కకుండా కుట్ర చేశారని చెప్పారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తుంటే, రిజర్వేషన్లు రద్దుకు కుట్ర అని బిజెపి తప్పుదారి పట్టించడం దారుణమన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

రీ సర్వే గ్రామాలకు స్పెషల్ ఆఫీసర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూములు రీ సర్వే గ్రామాలకు ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేకాధికారులుగా కొంతమంది ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర వ్యాప్తంగా 9,849 గ్రామాల్లో రీ సర్వే నిర్వహించాల్సి ఉండగా, ప్రస్తుతం ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్‌గా తీసుకుని భూములు రీ సర్వే ప్రక్రియ కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకాధికారులందరూ రీ సర్వే జరుగుతున్న పైలెట్ విలేజ్‌లను సందర్శించి పనుల పురోగతిని సమీక్షించాలని రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు.

తీర్పునకు లోబడే కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయింపు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

కల్లుగీత కార్మికుల కుటుంబాలకు మద్యం షాపుల కేటాయింపు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం తాము వెలువరించే తుది తీర్పుకు లోబడి ఉంటుందని హైకోర్టు వెల్లడించింది. కల్లుగీత కార్మికుల కుటుంబాలకు మద్యం దుకాణాల లైసెన్సుల జారీ నిలుపుదలకు ఉత్తర్వుల జారీకి నిరాకరించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం మంగళవారం ప్రకటించింది. మద్యం దుకాణాల కేటాయింపుల్లో 10 శాతం దుకాణాలను కల్లుగీత కార్మికులకు కేటాయింపు, లైసెన్సు ఫీజులు 50 శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను హైకోర్టు విచారించింది. మద్యం లైసెన్సులు పొంది వ్యాపారం చేస్తున్న పలువురు యజమానులు వేసిన పిటిషన్ల తరపున సీనియర్ అడ్వకేట్ వేదుల వెంకటరమణ, మనోహర్ రెడ్డి వాదించారు. రాష్ట్రంలో 3,450 మద్యం దుకాణాల్లో 345 షాపులను కల్లుగీత కార్మికులకు కేటాయించడం చట్ట విరుద్ధమన్నారు. పిటిషనర్లు మద్యం షాపు లైసెన్స్ ఫీజు కింద రూ.85 లక్షలు చెల్లించారని, ప్రభుత్వ నిర్ణయం వల్ల కల్లుగీత కార్మికులు రూ.42 లక్షలు చెల్లించాలని చెప్పడం వివక్ష కిందకు వస్తుందన్నారు. దీనిపై ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ ప్రతివాదన చేస్తూ, 2024 ఏడాదిలో చేసిన పాలసీకి అనుగుణంగా కల్లుగీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపులు ఉన్నాయన్నారు. దీనివల్ల ఎవరికీ నష్టం లేదన్నారు. స్టే ఇవ్వొద్దని కోరారు.

సూపర్‌సిక్స్‌పై చేతులెత్తేశారు

● పార్టీ సీనియర్ నేతలతో జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో చంద్రబాబునాయుడు చేతులెత్తేశారని మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. లండన్ పర్యటన అనంతరం తాడేపల్లి వచ్చిన ఆయన వైసిపి కేంద్ర కార్యాలయంలో సీనియర్ నాయకులతో మంగళవారం సమావేశమైనారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రచారం చేసిన సూపర్‌సిక్స్ హామీని అమలు చేయకుండా ఏవేవో సాకులు చెబుతూ ఇప్పుడు ఆచరణకు సాధ్యం కాదని ప్రచారం చేస్తున్నారన్నారు. కేవలం అప్పులతో కాలం వెళ్లదీయడం వంటి అంశాలనూ ప్రజల్లో ఎండగట్టాలని నిర్దేశించారు.

నాయకత్వం రోజూ ప్రజల్లో ఉండాలని, వారితో మమేకం కావాలని సూచించారు. ఫీజుపోరుపై ఇసి అనుమతి పెండింగ్‌లో ఉండటంతో వాయిదా వేసినట్లు తెలిపారు. కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తూ విద్యార్థులను మోసం చేస్తున్నారని అన్నారు. కేంద్రం వచ్చే ఐదేళ్లలో 75 వేల మెడికల్ సీట్లు పెంచుతోందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తమకు సీట్లు వద్దని లేఖ రాయడం దారుణమని తెలిపారు. ఈ అంశాన్ని ఫీజుపోరులో భాగస్వామ్యం చేయాలని పేర్కొన్నారు. మున్సిపల్ ఉప ఎన్నికల తీరుపైనా చర్చించారుఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు సమిష్టి చర్యలు

● స్పెషల్ సిఎస్ కృష్ణబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తాగునీటి వల్ల సంక్రమించే వ్యాధులను అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమిష్టిగా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టి కృష్ణబాబు సూచించారు. ఈ అంశంపై సచివాలయంలో పంచాయతీరాజ్, పురపాలక, పాఠశాల విద్య, గిరిజన సంక్షేమశాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ.. కాలుష్యాన్ని నివారించడానికి నీటి పైప్‌లైన్ లీకేజీలను వెంటనే గుర్తించి తగిన చర్యలు తీసుకునేందుకు పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖలు క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు.

ఆయా శాఖల పరిధిలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో ఆహారం, తాగునీటి పరీక్షలు, వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. నీటిని శుద్ధి చేసేందుకు అన్ని పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ అవసరమైన మేర సరఫరా చేయాలన్నారు. స్థానికంగా నీటి నాణ్యత పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్‌శాఖ, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శులు శశిభూషణ్ కుమార్, ఎస్ సురేష్ కుమార్, మున్సిపల్‌శాఖ డైరెక్టర్ సంపత్‌కుమార్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎం నాయక్, వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం ఐటిడిఎ ఐబి పై విచారణ

ఎపి వెలుగు విఓఎ ఉద్యోగుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రంపచోడవరం ఐటిడిఎ ఎపిఎంహెచ్‌ఆర్, ఐబి, బి రాధఅపర్ణ అవినీతిపై రాష్ట్రస్థాయి అధికారుల నేతృత్వంలో నేరుగా విచారణ చేయిస్తామని సెర్ప్ సిఇఓ కరుణ హామీనిచ్చినట్లు ఎపి వెలుగు విఓఎ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి పేర్కొన్నారు. ఎపి వెలుగు విఓఎ ఉద్యోగుల సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీతో సెర్ప్‌సిఇఓతో జాయింట్ మీటింగ్ నిర్వహించారు. కాలపరిమితి సర్క్యులర్ రద్దు మినహా మిగిలిన అన్ని సమస్యలు పరిష్కరిస్తామని తమకు హామీ నిచ్చినట్లు వారు వెల్లడించారు. విఓఎల పోరాట ఫలితంగా ఇప్పటికే ఐదు నెలల బకాయి వేతనాలు ప్రభుత్వం విడుదల చేసిందని, డిసెంబరు నెలకు సంబంధించిన వేతనం కూడా ఈ వారంలో విడుదల చేస్తామని హామీనిచ్చారన్నారు. కోర్టు ఉత్తర్వుల అమలు విషయం పిడితో మాట్లాడుతానని కరుణ తెలిపారన్నారు. గ్రూఫ్ ఇన్స్యూరెన్స్‌కు సంబంధించి ఇసిమీటింగ్‌లో చర్చిస్తామన్నారు. చర్చల్లో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ,ప్రధాన కార్యదర్శి సిహెచ్‌రూపాదేవి, కె,ధనలక్ష్మి, కోశాధికారి ఎ.తిరుపతయ్యతో పాటు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. చర్చల అనంతరం రాష్ట్ర కమిటీ సమావేశంజరిగింది. కాలపరిమితి సర్క్యులర్ రద్దు కోసంరాబోయో బడ్జెట్ సమావేశాల్లోఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించిందని ధనలక్ష్మి తెలిపారు.

కేన్సర్‌పై పోరాటంలో సెలబ్రిటీలు కలిసిరావాలి

● మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేన్సర్‌పై పోరాటంలో ప్రభుత్వంతోపాటు వైద్యులు, పౌర సమాజం, ప్రజా ప్రతినిధులు, సెలబ్రిటీలు కలిసిరావాలని వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. నివారణ, ముందస్తు పరీక్షలు, తొలిదశలో గుర్తించడం, సరైన చికిత్స అందించడం ద్వారానే కేన్సర్ మహమ్మారిని ఎదుర్కోగలమని తెలిపారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌లకు ఉచిత ముందస్తు పరీక్షలు నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

తిరుపతి, నందిగామ టిడిపి కైవసం

● తిరుపతిలో టిడిపి అభ్యర్థిని గెలిపించిన వైసిపి కార్పొరేటర్లు
● పాలకొండలో గైర్హాజరైన వైసిపి కౌన్సిలర్లు
● కాకినాడ జిల్లా తునిలో ఎన్నికను అడ్డుకున్న టిడిపి నాయకులు



తునిలో నేలపైనే బైఠాయించి నిరసన తెలుపుతున్న వైసిపి ఛైర్మన్ సుధారాణి, కౌన్సిలర్లు

ప్రజాశక్తి - యంత్రాంగం

తిరుపతి మున్సిపల్ డిప్యూటీ మేయర్ స్థానం, ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానాలను టిడిపి కైవసం చేసుకుంది. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీ ఛైర్మన్, పల్నాడు జిల్లాలో పిడుగురాళ్ల మున్సిపల్ వైస్‌ఛైర్మన్-2, కాకినాడ జిల్లా తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి.

తిరుపతిలో టిడిపి అభ్యర్థిని వైసిపి కార్పొరేటర్లు గెలిపించారు. కార్పొరేట్లతో సహా వైసిపి, టిడిపి, జనసేన, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎంపి గురుమూర్తితో కలిసి 48 మంది ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల అధికారి పేర్కొన్నారు. ముందుగా వైసిపి కార్పొరేటర్ డిప్యూటీ మేయర్ అభ్యర్థి లడ్డు భాస్కర్‌రెడ్డికి ఎంపితో సహా 21 ఓట్లు పడ్డాయి. టిడిపి అభ్యర్థికి ఎమ్మెల్యేతో సహా 26 మంది ఓటు వేశారు. వైసిపి కార్పొరేటర్లు ఒక్కొక్కరుగా చేజారిపోవడంతో టిడిపి అభ్యర్థి మునికృష్ణ డిప్యూటీ మేయర్‌గా గెలుపొందారు. ఎన్నికల అయిన తర్వాత నలుగురు కార్పొరేటర్లు తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన కాళ్లు పట్టుకొని క్షమాపణ కోరారు. కూటమి పార్టీ నేతలు తమను అనేక ఇబ్బందులకు గురిచేశారని అందువల్లే వారికి ఓటు వేయాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా టిడిపికి చెందిన మండవ కృష్ణకుమారి ఎన్నికయ్యారు. ఎక్స్ అఫీషియో సభ్యులు, స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతోపాటు 18 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. ఎమ్మెల్యేతో కలిపి కృష్ణకుమారికి 15 మంది మద్దతు పలికారు. వైసిపి అభ్యర్థి కేవలం నలుగురు మాత్రమే మద్దతు తెలిపారు.

పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నగర పంచాయతీ ఛైర్మన్ ఎన్నిక సమావేశానికి వైసిపి కౌన్సిలర్లు హాజరు కాలేదు. 12 గంటల వరకు అధికారులు వేచి చూసిన వైసిపి కౌన్సిలర్లు రాలేదు. కోరం లేనందున వాయిదా వేస్తున్నట్లు సబ్ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి చెప్పారు. పల్నాడు జిల్లాలో పిడుగురాళ్ల మున్సిపల్ వైస్‌ఛైర్మన్-2 ఎన్నికకు 32 మంది కౌన్సిలర్లలో ఐదుగురు మాత్రమే హాజరవడంతో కోరం లేని కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. 13 మంది వైసిపి కౌన్సిలర్లు ఎన్నికకు హాజరవకుండా పోలీసులే కిడ్నాప్ చేయించారని మాజీ ఎమ్మెల్యే కాసుమహేష్‌రెడ్డి ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నికకు ఎన్నికల అధికారులు, వైసిపికి చెందిన మున్సిపల్ ఛైర్మన్ ఏలూరు సుధారాణితో పాటూ కౌన్సిలర్లు కార్యాలయంలోకి వెళ్తుండగా టిడిపి నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఛైర్మన్, కౌన్సిలర్లు ఛాంబర్ బయట నేలపైనే బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఎన్నికల అధికారులు వైస్‌ఛైర్మన్ ఎన్నికను మళ్లీ వాయిదా వేశారు.

వైసిపి ఎమ్మెల్యేలు ఉన్నచోట అధికార పార్టీ ఇన్‌ఛార్జుల పెత్తనం

● వైసిసి ఎమ్మెల్యే విరూపాక్షి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం చట్టసభల ప్రతినిధులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తోందని, వైసిపి ఎమ్మెల్యేలు ఉన్నచోట అధికార పార్టీ ఇన్‌ఛార్జులు పెత్తనం చేస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరూపాక్షి పేర్కొన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికార పార్టీకి ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా సహకరిస్తున్నారని, రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత వారికి లేదా అని ప్రశ్నించారు.

ఆలూరు నియోజకవర్గంలో ఒక ఉద్యోగం కోసం ఫీల్డు అసిస్టెంటును అధికార పార్టీ నాయకులు నరికి చంపారని, దీనిపై చంద్రబాబుకు చీమకుట్టినట్లయినా లేదని అన్నారు. మరోవైపు రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. ఇప్పటికే మూడు లక్షలకుపైగా పెన్షన్లకు కోత పెట్టారని, చంద్రబాబు హామీలకు తాను గ్యారంటీ ఉంటానని చెప్పిన పవన్‌కల్యాణ్ పత్తా లేకండా పోయారని ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకపోతే కాలర్ పట్టుకోవాలన్న లోకేష్ ఇప్పుడు ఏమి చెబుతారని ప్రశ్నించారు.

ఉప ఎన్నికల్లో కూటమి అరాచకం

మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు

మున్సిపల్ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అరాచకం, గూండా రాజ్యం, తాలిబన్ పాలన మాదిరి వ్యవహరించిందని మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు ఆరోపించారు. దాడులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌లతో పదవులు దక్కించుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలకు పూర్తి తిలోదకాలు ఇచ్చారని, మంత్రులు, ఎమ్మెల్యేల కనుసన్నల్లో దాడులు జరిగాయని పేర్కొన్నారు. పదవులు దక్కించుకునేందుకు కూటమి నేతలు దిగజారారని అన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది తొలగింపు తగదు

● ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



విశాఖ ఉక్కు కర్మాగారంలో కీలకమైన సిఐఎస్‌ఎఫ్‌కు చెందిన 438 మంది సిబ్బందిని తొలగించడం సరికాదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, నాయకులు శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1454వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎల్‌ఎంఎం, ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టిఎం విభాగాలకు చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూఉక్కు కర్మాగార విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించకుండా ద్వంద వైఖరి అవలంబిస్తోందని అన్నారు. ఇప్పటికే ఉక్కు ఉద్యోగుల తొలగింపులో భాగంగా విఆర్‌ఎస్‌ను ప్రకటించిందని అన్నారు. తాజాగా ఉక్కులో సిఐఎస్‌ఎఫ్ సిబ్బందిని తొలగించడం దారుణమన్నారు. సిఐఎస్‌ఎఫ్ వద్ద అధునాతన ఆయుధాలు ఉంటాయని, ప్లాంట్‌ను రక్షించడంలో వారి పాత్ర కీలకమని, ఈ నేపథ్యంలో తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉక్కు ఉద్యోగులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించకపోయినా వారంతా అంకిత భావంతో ఉత్పత్తిలో నిమగ్నమైన విషయాన్ని గుర్తుచేశారు. కర్మాగారం అభివృద్ధి కోసం నిత్యం శ్రమిస్తున్న ఉద్యోగులకు, కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించకుండా పర్సంటేజీల రూపంలో చెల్లిస్తుండడం దుర్మార్గమన్నారు. దీక్షల్లో నాయకులు డి దేముడు, ఎం త్రినాథ్, జి ఆనంద్, ఎంకెవి రాజేశ్వర్‌రావు, నంబారు సింహాద్రి, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



మెరుగైన రహదారులే లక్ష్యం

● మంత్రి బిసి జనార్థన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజలకు మెరుగైన రహదారులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి) రోడ్ల పనుల పురోగతిపై ఆయా కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో వివిధ కారణాలతో నిలిచిపోయిన ఎన్‌డిబి రోడ్ల పనులు పున్ణప్రారంభించామని, ఈ క్రమంలో ఎదురయ్యే అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని తెలిపారు. ఇప్పటికే 80 శాతం రోడ్లను గుంతల రహితం చేసినట్లు చెప్పారు. ఎన్‌డిబి రోడ్ల పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాల్సిన అవసరం ఉందని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. ఎన్‌డిబి రోడ్ల కాలపరిమితిని 2026 వరకూ పొడిగించాలని కోరారు. అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. పెండింగ్ బిల్లులనూ త్వరితగతిన విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బి ఇఎన్‌సి నయీముల్లా తదితరులు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో జాతీయ నాస్తిక మేళా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నాస్తిక సమాజం ఆధ్వర్యాన ఈ నెల 8, 9 తేదీల్లో జాతీయ నాస్తిక మేళాను గుంటూరు జిల్లా మంగళగిరిలోని చార్వాకాశ్రమంలో నిర్వహించనున్నట్లు విజయవాడ శాఖ కన్వీనర్ ఎస్‌కె జిలానీ భేగం తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ నాస్తిక మేళా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించిన సందర్భంగా ఆమె మాట్లాడారు.

జాతీయ నాస్తిక మేళాను జయప్రదం చేయాలని కోరారు. సైన్సు, శాస్త్రీయ భావజాలం నుంచి సమాజాన్ని చీకటి యుగాల వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతుందని, దీన్ని ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నాస్తిక సమాజం నాయకులు శివారెడ్డి మాట్లాడుతూ.. శాస్త్ర విజ్ఞానంపైనా, ప్రత్యేకించి శాస్త్రీయ దృక్పథంపైనా తీవ్రమైన దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రగతిశీల శక్తులు తమ కార్యాచరణను పదునెక్కించాలని కోరారు. నాస్తిక సమాజం నాయకులు వివిడిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ.. నాస్తిక మేళా జరిగే రెండు రోజులూ భౌతికవాదానికి సంబంధించిన ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యుదయ వాదులందరూ మేళాలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాలిన్, విఎన్‌యు రాజ్యలక్ష్మి, జయబాబు, భాస్కరరావు, రమేష్, ఎస్‌ఎస్ వరప్రసాద్, కోయ వెంకటేశ్వర్లు, కృష్ణ, సహదేవుడు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ వద్దని పిల్

ప్రజాశక్తి-అమరావతి

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చట్ట వ్యతిరేకమంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. 'కర్నూలులో హైకోర్టు బెంచ్ అవసరం లేదు. ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయాలి. హైకోర్టును విభజించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. ఎపి పునర్విభజన చట్టం ప్రకారం బెంచ్ ఏర్పాటు ప్రతిపాదన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుంచి రావాలే తప్ప, ప్రభుత్వం నుంచి కాదు. భావోద్వేగాలు, మనోభావాలు, రాజకీయ కారణాలతో బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడానికి వీల్లేదు. ఇ-ఫైలింగ్, వీడియో కాన్ఫరెన్స్ వంటి సౌకర్యాలు వచ్చాక బెంచ్ అవసరం లేదు. ప్రభుత్వ నిర్ణయం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధం 1985లో జస్వంత్ సింగ్ కమిషన్ ఇచ్చిన నివేదికకు వ్యతిరేకంగా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంది. రాయలసీమకు చివర్లో కర్నూలు ఉంది. రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ ఉన్న అమరావతిలోనే హైకోర్టు ఉండాలి. కర్నూలు కన్నా విజయవాడకే మంచి రోడ్డు, రైలు సౌకర్యం ఉంది. ఇదే విధంగా చేయడం మొదలుపెడితే రేపు, విశాఖపట్నం నుంచి కూడా డిమాండ్ రావచ్చు. కర్నూలులో బెంచ్ ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని రద్దు చేయాలి' అని న్యాయవాదులు తాండవ యోగేష్, తురగ సాయి సూర్య వేసిన పిల్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ప్రతివాదులుగా చేర్చారు.

విఆర్‌ఎ కుటుంబ సభ్యుల అరెస్టులు అక్రమం

● ఎపి విఆర్‌ఎల సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విఆర్‌ఎల కుటుంబ సభ్యులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (గ్రామ సేవకుల సంఘం) తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టు వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగి సాహెబ్, ప్రధాన కార్యదర్శులు కె.ఉమామహేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 61 సంవత్సరాలు నిండిన విఆర్‌ఎల వారసులకు విఆర్‌ఎలకు ఇచ్చిన విధంగా జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, సభార్డినేట్ ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం హైదరాబాదులో మంత్రుల ఇళ్ల వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారన్నారు. గతంలో 81, 87 జివోలతో 60 ఏళ్లలోపు ఉన్న 16,700 మంది విఆర్‌ఎలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని, మిగిలిన 3,700 మంది 61 ఏళ్లు నిండిన విఆర్‌ఎల వారసులకు కూడా త్వరలో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు మొండిగా వ్యహరించడంతో విఆర్‌ఎల కుటుంబ సభ్యులు నిరసన తెలిపారని చెప్పారు. రాష్ట్రంలోను విఆర్‌ఎల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడాన్ని ఖండించారు. గత ఎనిమిదేళ్లుగా విఆర్‌ఎల జీతాలు పెంచలేదన్నారు. పని భారం పెంచినట్లు చెప్పారు. తెలంగాణలో అమలువుతున్న విధంగా పే స్కేల్ జీతాలు చెల్లించాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

ప్రజాశక్తి- బనగానపల్లె (నంద్యాల)

నంద్యాల జిల్లా బనగానలపల్లె మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు తప్పిపోయారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. తిమ్మాపురం మజరా గ్రామం జిల్లెల్లకు చెందిన సూరబోయిన యేసు రత్నం కుమార్తె సూరబోయిన కల్పన.. నందివర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. సూరబోయిన మోహన్ కుమార్తె కీర్తి.. పాణ్యం గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. పాఠశాలలకు వెళ్తున్నామని ఇద్దరూ తమ ఇళ్ల నుంచి సోమవారం బయటకు వచ్చారు. సాయంకాలం తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు వెతకసాగారు. విద్యార్థులిద్దరూ పాఠశాలలకు వెళ్లలేదని తేలడంతో కల్పన తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అదానీ అవినీతి ముమ్మాటికి నిజమే

- ఆ రిపోర్ట్‌కు కట్టుబడి ఉన్నాము..
- పత్రికల్లో చూసే పరిశోధించాము
- ఎవరి భయానికో ఏజెన్సీని మూసివేయలేదు
- హిండెన్‌బర్గ్ ఫౌండర్ ఆండర్సన్ వెల్లడి



న్యూఢిల్లీ : ప్రముఖ బిలియనీర్ గౌతం అదానీ అవినీతిపై తాము ఇచ్చిన రిపోర్ట్‌కు ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని అమెరికన్ షార్ట్ సెల్లర్ రీసెర్చ్ ఏజెన్సీ హిండెన్‌బర్గ్ ఫౌండర్ నథన్ అండర్సన్ అన్నారు. అదానీ గ్రూపునే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నామనే విషయాన్ని ఆండర్సన్ తొలిసారి వెల్లడించారు. అదానీ గ్రూప్ తన కంపెనీల ఆదాయాన్ని పెంచడానికి, షేర్ల ధరలను మార్చడానికి విదేశీ బినామీ, షెల్ కంపెనీలను వాడుకుందని.. అదానీ తీవ్ర ఆర్థిక మోసాలకు పాల్పడ్డారని గతేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ సంచలన రిపోర్ట్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ దెబ్బతో ఆ సమయంలో స్టాక్ మార్కెట్‌లో అదానీ గ్రూపు కంపెనీల విలువ దాదాపు రూ.12 లక్షల కోట్లు హరించుకుపోయింది.

ఏదైనా చట్టపరమైన లేదా మరేదైనా బెదిరింపు వల్ల ఇటీవల తన సంస్థను మూసివేయాలని నిర్ణయించలేదన్నారు. పని భారం వల్లే మూసివేశామన్నారు. అదానీ గ్రూప్‌నకు వ్యతిరేకంగా ఉన్న నివేదికతో సహా తన అన్ని నివేదికలకు 100 శాతం కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కొన్ని మీడియా గ్రూపుల్లో అదానీ అక్రమాలపై వచ్చిన రిపోర్ట్‌ల ఆధారంగా తాము అదానీ గ్రూపునపై పరిశోధన చేపట్టాలని నిర్ణయించామన్నారు. మీడియా కథనాలను నిశితంగా పరిశీలించామని.. సాక్షాలను సంపాదించామన్నారు. దాదాపు 100 పేజీల సాక్ష్యాలను రిపోర్ట్‌లో పొందుపర్చామన్నారు.


హిండెన్‌బర్గ్ నివేదిక భారతదేశ ఆర్థిక వృద్ధిపై దాడి అనే వాదనలను ఆండర్సన్ కొట్టిపారేశారు.

"మేము ఎల్లప్పుడూ భారతదేశ సామర్థ్యాన్ని విశ్వసిస్తున్నాము. మార్కెట్ పారదర్శకత. బలమైన కార్పొరేట్ పాలన భారతదేశ వృద్ధికి మద్దతునిచ్చే అంశాలుగా చూస్తాము." అని ఆండర్సన్ పేర్కొన్నారు. హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌ను మూసివేస్తున్నట్లు జనవరిలో ఆండర్సన్ ప్రకటించాడు. చట్టపరమైన లేదా వ్యక్తిగత బెదిరింపుల వల్ల ఈ నిర్ణయం తీసుకోలేదన్నారు. పని భారం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. హిండెన్‌బర్గ్‌ను మూసివేసినప్పటికీ అదానీ గ్రూప్‌తో సహా అన్ని సంస్థ నివేదికలు ఖచ్చితమైనవని అండర్సన్ సమర్థించుకున్నారు. అయితే రెగ్యూలేటరీ సంస్థలు చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించగా.. తాము పారదర్శకత అవసరమయ్యే సమస్యల గురించి పరిశోధించడం, వ్రాయడం వరకే తమ బాధ్యత అని.. మిగితావి తమ చేతుల్లో ఉండవన్నారు.

తెలంగాణలో బిసి జనాభా 1,64,09,179

- సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (సమగ్ర ఇంటింటి కటుంబ సర్వే) నివేదికను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. కుల గణన, ఎస్‌సి వర్గీకరణ నివేదికలపై చర్చించేందేకు మంగళవారం ప్రత్యేకంగా అసెంబ్లీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ మాట్లాడుతూ హౌస్ లిస్టింగ్ చేసిన మొత్తం 1,15,71,457 కుటుంబాల్లో 96.9శాతం మేర సర్వే జరిగిందన్నారు. సర్వే చేయని కుటుంబాలు 3,56,323 ఉండగా..అవి జిహెచ్‌ఎంసి, ఇతర నగరాల్లో ఎక్కువ ఉన్నాయని వివరించారు. మంత్రివర్గం తీర్మానించిన ఏడాది లోపుగా సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులు, సిబ్బందిని సిఎం సభాముఖంగా అభినందించారు. శాసనసభ ప్రారంభానికి ముందుగానే ఉదయం 10.30గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్‌లో సిఎం అధ్యక్షనత మంత్రివర్గ సమావేశం జరిగింది. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నివేదిక, ఎస్‌సి వర్గీకరణపై డా జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ సమర్పించిన నివేదికలకు కేబినేట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో మొత్తం 3,54,77,554 మందిని సర్వేచేశారు. బిసి జనాభా 1,64,09,179 (ముస్లిం మైనార్టీ మినహా) మొత్తంలో 46.25శాతం, ఎస్‌సిలు 61,84,319 (మొత్తంలో 17.43 శాతం), ఎస్‌టిలు 37,05,929 (మొత్తంలో 10.45 శాతం), ముస్లిం మైనార్టీలు మొత్తం 44,57,012 (మొత్తంలో 12.56 శాతం) ఉన్నారు. వీరిలో ఒసిలు 8,80,424 (2.48 శాతం), బిసిలు 35,76,588 (10.08శాతం), ఒసి జనాభా (ముస్లిం మైనార్టీలో 8,80,424 ఒసిలను కలుపుకుని) 56,01,539 (15.79శాతం) సమగ్ర ఇంటింటి సర్వే నివేదిక వెల్లడైంది.

మతోన్మాద విషకౌగిలి నుంచి 'బాబు' బయటపడాలి

సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి- నెల్లూరు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బిజెపి మతతత్వ విషకౌగిలి నుంచి బయటకు రావాలని సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. ఎన్నికల్లో తాను అధికారంలోకి వస్తే మైనార్టీలను కాపాడతానని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఇప్పుడు బిజెపితో భాగస్వామ్యమై రాష్ట్రంలో మత ఘర్షణలు జరుగుతున్నా ఏమీ మాట్లాడకపోవడం చూస్తుంటే మైనార్టీలు, క్రైస్తవులంటే ఏమాత్రం ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. లౌకికవాదాన్ని కాపాడుకోవాలని ఒక్క వామపక్ష పార్టీలే పోరాటాలు చేస్తున్నాయన్నారు. నరేంద్రమోడీ నాయకత్వంలో బిజెపి ముస్లిములు, క్రైస్తవులు, హిందువుల మధ్య చిచ్చు పెడుతూ మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. అమితాషా, మోడీ ఇద్దరూ కలిసి వారి రాజకీయాల కోసం ఈ దేశాన్ని మతం పేరుతో సర్వనాశనం చేస్తున్నారన్నారు. ఒక్క బాబ్రీ మసీదు సమస్యే కాదని, దేశంలో పలు రాష్ట్రాల్లో బాబ్రీ మసీదు లాంటి ఘటనలు జరిగేందుకు కాషాయమూకలు కుట్రపన్నుతున్నాయన్నారు. సిపిఎం సిద్ధాంతాల్లోనూ, పోరాటాల్లోనూ, ప్రజలను కాపాడుకోవడంలోనూ ఇప్పటికీ ఎలాంటి మార్పూ లేదని, కమ్యూనిస్టులు మారిపోయారని చెబుతున్న వారిలోనే మార్పు వచ్చిందన్నారు. నిరంతరం ప్రజలకోసం పోరాడేది మార్క్సిస్టు పార్టీనని అన్నారు.


ఎంఎ గఫూర్

ప్రమాదకర పరిస్థితుల్లో దేశం ఉందని, మత రాజకీయాలు చేస్తున్న బిజెపికి దేశాభివద్ధి ఏమాత్రం పట్టదని అన్నారు. ప్రజల విశ్వాసానికి తాము గౌరవిస్తామని, అయితే కుంభమేళా తొక్కిసలాట ఘటనలో ప్రశ్నిస్తే దాన్ని మతం పేరుతో బిజెపి రంగు పులిమేస్తుందని అన్నారు. రాష్ట్ర రాజధాని విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహారం అప్పు తెచ్చి పప్పుకూడు అన్న చందంగా ఉందన్నారు. ఎన్నాళ్లు అప్పుచేసి పప్పుకూడు తింటామని ప్రశ్నించారు. ప్రజలు జగన్‌కి అధికారం ఇస్తే మూడు ముక్కలాట ఆడటంతో ప్రజలు తిరస్కరించారన్నారు. చంద్రబాబు కూడా అమరావతి, రాష్ట్రాభివద్ధి విషయంలో విజన్ 2047 పేరుతో ఈస్ట్‌మన్ కలలు కంటున్నారని, అది సాధ్యంకాదని అన్నారు. తాము కోరుతున్నది ఒకటేనని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని అన్నారు.


డి.రమాదేవి

ఎన్‌డిఎతో భాగస్వామ్యం అయిన చంద్రబాబు ఈ రాష్ట్రానికి రావాల్సిన విభజన చట్టం హామీలను, ప్రత్యేక హోదా, ప్యాకేజీలను తీసుకొచ్చేలా చూడాలని, లేదంటే ప్రజలను మోసగించిన వారవుతారన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతాలకు సత్వరం అతి తక్కువ టైంలో డబ్బులు ఖర్చు చేస్తే రైతులకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉందని, ఒట్టిమాటలు మాట్లాడి ప్రజల చెవిలో పూలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీన్ని రాష్ట్ర ప్రజలు విశ్వసించరని అన్నారు.

మహిళలకు ద్రోహం చేస్తున్న రాష్ట్రప్రభుత్వం : డి.రమాదేవి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ పళ్లు రాలగొట్టుకునేందుకు ఏ రాయి అయితేనేం అన్న చందంగా నాడు జగన్, నేడు చంద్రబాబు ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. ఎన్నికల హామీల్లో భాగంగా రూ.10 లక్షల వరకూ వడ్డీ ఉండదని డ్వాక్రా మహిళలకు హామీ ఇచ్చి, నేటికీ అమలు చేయకపోవడం చంద్రబాబు మహిళలకు చేసిన ద్రోహం కాదా అని ప్రశ్నించారు. ఊరూరా బెల్ట్ షాప్‌లను ఏర్పాటు చేసి మహిళల పుస్తెలతో ఆడుకుంటున్నారని అన్నారు. బెల్ట్ షాపులు బద్దలు కొట్టేందుకు మహిళలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పసి బిడ్డలు మొదలుకుని పండు ముసలి వాళ్లపైనా అఘాయిత్యాలు జరుగుతుంటే దోషులపై చర్యలు తీసుకోకుండా ముఖ్యమంత్రి చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఎవరో వస్తారని... ఏదో చేస్తారని... ఆలోచించకుండా పోరాటం వైపు ప్రజలు నడవాలని ఆమె పిలుపునిచ్చారు.

ప్రముఖ సముద్ర పరిశోధన శాస్త్రవేత్త మద్దిలేటి రెడ్డి మృతి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్



ప్రముఖ సముద్ర పరిశోధన శాస్త్రవేత్త, రచయిత డాక్టర్ ఎంపి మద్దిలేటిరెడ్డి (95) మరణించారు. వయోభారం సమస్యలతో కర్నూలులోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆయనకు కుమారుడు మనోహర్ ఉన్నారు. భార్య కమల గతంలోనే మరణించారు. కర్నూలులో అంత్యక్రియలు నిర్వహించారు.

కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండలం సుద్దమల్ల గ్రామంలో మద్దమ్మ, చిన్న మద్దిలేటి దంపతులకు మద్దిలేటిరెడ్డి జన్మించారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఎంఎస్‌సి మెటిరియాలజీ అండ్ ఓషనోగ్రఫి పూర్తి చేసి, అదే విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్‌డి పొందారు. 1963లో నేషనల్ రీసెర్చ్ కౌన్సిల్ ఆఫ్ కెనడా పోస్టు డాక్టరేట్ ఫెలోషిప్ రావడంతో కెనడా వెళ్లిపోయారు. మొదటి ప్రాజెక్టుగా వేవ్ కండీషన్స్, లాంగ్ షోర్ కరెంట్స్, లిట్టోరల్ డ్రిఫ్ట్ సమర్థవంతంగా పూర్తి చేశారు. సముద్రశాస్త్రంపై ఆయన రాసిన పుస్తకాలు ప్రపంచంలో దాదాపు 50 దేశాలకు పైగా వివిధ విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా ఉన్నాయి. లండన్ లైబ్రరీలో హూ ఈజ్ హూలో మద్దిలేటిరెడ్డి పేరు నమోదైంది.1977లో భారత రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డితో ప్రసంశలు అందుకున్నారు. మద్దిలేటిరెడ్డి మృతికి కర్నూలుకు చెందిన కవులు చంద్రశేఖర కల్కూరా, కెంగార మోహన్, జంధ్యాల రఘుబాబు, ఇనాయతుల్లా, అజీజ్, ఆద్య మెడికల్ అధినేత వెంకటేశ్వర రెడ్డి తదితరులు సంతాపం ప్రకటించారు.

తిరుమల, అరసవల్లిలో రథసప్తమి వేడుకలు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఆదిత్యుని జయంతి సందర్భంగా రథసప్తమి వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. రథసప్తమి సందర్భంగా తిరుమలతోపాటు శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి సూర్యదేవాలయానికి యాత్రికులు పోటెత్తారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి 12.30 గంటలకు ప్రారంభమైన క్షీరాభిషేక సేవ మంగళవారం ఉదయం వరకు సాగింది. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి వినయ్‌చంద్.. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. రథసప్తమి వేడుకలను వీక్షించేందుకు అర్ధరాత్రి నుంచే రాష్ట్రంలోని పలు ప్రాంతాలతోపాటు తెలంగాణ, ఒడిశా నుంచి వేల సంఖ్యలో యాత్రికులు చేరుకున్నారు. కేంద్ర పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్వామి వారిని దర్శించుకున్నారు. తిరుమలలో సప్త వాహనాలపై శ్రీవారిని ఊరేగించారు. వాహన సేవలను తిలకించేందుకు వచ్చే యాత్రికులను దృష్టిలో ఉంచుకొని టిటిడి అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. గ్యాలరీలలో వేచి ఉండే యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా తిరు వీధుల్లోని గ్యాలరీల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశారు. వాహన సేవలను తిలకించేందుకు తిరుమాఢ వీధులకు వెలుపల అధికారులు భారీ ఎల్ఇడి స్క్రీన్లను ఏర్పాటు చేశారు. రెండు వేల మంది పోలీసులతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు.

అశేషంగా తరలివచ్చిన యాత్రికులు


తిరుమలలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

రాష్ట్ర పండుగగా రథసప్తమి : మంత్రి ఆనం

రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించినట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని శ్రీ మూలస్థానేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి సందర్శించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఆదేశాలతో రథసప్తమి వేడుకలను రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పురాతన ఆలయాలను ఆగమశాస్త్రం ప్రకారం పున:నిర్మించి పూర్వవైభవానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. నెల్లూరు జిల్లాలో 18 ప్రసిద్ధ ఆలయాల పునర్ నిర్మాణానికి రూ.38 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడి

- ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్

ప్రజా శక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని ప్రభుత్వాన్ని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవనంలో మంగళవారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అసోసియేషన్ అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజు, రామిశెట్టి వెంకట రాజేష్ మాట్లాడుతూ.. జనాభా పనిభారం ఆధారంగా ప్రతి మండలం, డివిజన్, కలెక్టర్ కార్యాలయాల్లో సిబ్బందిని పెంచాలన్నారు. రెవెన్యూ కార్యాలయాల్లో కనీస మౌలిక వసతులు కూడా లేక మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న రెవెన్యూ కార్యాలయాల స్థానంలో కొత్త కార్యాలయాలు నిర్మించాలని, తక్షణమే రెవెన్యూ అకాడమీ ఏర్పాటుచేసి సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చి తద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. రెవెన్యూ సిబ్బందికి చట్టాలపై అవగాహన తప్పనిసరన్నారు. ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించే బాధ్యతను ఇటు అధికారులు అటు ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ స్థాయిలో రిక్రూట్ అయిన వారికి కనీసం 42 రోజులు ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వాలన్నారు.

మిర్చి రైతులను ఆదుకోండి

- ఎపి రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మిర్చి పంటకు క్వింటాలుకు రూ.25 వేలకు తక్కువ లేకుండా ధరలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. మిర్చి పంటను విదేశాలకు ఎగుమతి చేసేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి మిర్చి రైతుల ప్రయోజనాలను కాపాడాలని పేర్కొంది. ఈ మేరకు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి మంగళవారం వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు లేఖ రాశారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది రైతులు మిర్చి పంట విస్తారంగా సాగు చేస్తున్నారని, రాయలసీమ, పల్నాడు, గుంటూరు, ఎన్‌టిఆర్, రంపచోడవరం, ఉత్తరాంధ్ర దాదాపు అన్ని జిల్లాల్లో మిర్చి పంటసాగు చేస్తున్నారని లేఖలో ప్రస్తావించారు. 2023-24 ఆర్థిక సంవత్సరం కంటే ఈ ఏడాది మిర్చి పంట సాగు విస్తీర్ణం సుమారు లక్ష ఎకరాలకు తగ్గిందన్నారు. 2004-25 ఆర్థిక సంవత్సరంలో సుమారు 4 లక్షల ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారని, ఈ పంటకు నల్లతామర, ఎమిని వైరస్ వంటి తెగుళ్లు వచ్చి దిగుబడి తగ్గిందన్నారు. విత్తనం మొదలు పంట కోత వరకు ఎరువులు, క్రిమిసంహారక మందులు, ఇతర పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగి ఎకరాకు రెండున్నర లక్షలకు పైగానే పెట్టుబడి పెట్టాల్సి వచ్చిందన్నారు. పంట దిగుబడి తగ్గిపోవడం, పెట్టుబడి ఖర్చులు పెరిగిపోవడం, మార్కెట్లో ధరలు కూడా పడిపోవడంతో మిర్చి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. 2023 డిసెంబరులో క్వింటాలు రూ.23 వేల నుంచి రూ.26 వేల వరకు ధర పలికిందని, ఇప్పుడు రూ.9 వేల నుంచి రూ.12 వేల మధ్యలో ధర పలుకుతోందన్నారు. ఈ ఏడాది పండిన పంటను నిల్వ చేసేందుకు గిడ్డంగుల్లో సరిపడా స్థలం కూడా లేదన్నారు. ఈ పరిస్థితుల్లో క్వింటాలుకు కనీసం రూ.25 వేలు ధర వస్తే కానీ మిర్చి రైతుకు గిట్టుబాటు కాదన్నారు.

'చంద్రబాబు' స్థలం కబ్జా కేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-బాపట్ల

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేరు మీద బాపట్ల పట్టణం శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఉన్న తొమ్మిదిన్నర సెంట్ల భూమిని ఫోర్జరీ సంతకాలతో తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి భూమిని కొట్టేసిన నిందితులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బాపట్ల డిఎస్‌పి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బాపట్ల పట్టణంలో శ్రీనివాసనగర్ కాలనీలో సర్వే నెంబరు 969/1 గల సుమారు 9.5 సెంట్ల భూమిని బాపట్లకు చెందిన ముప్పా సుబ్బారావు కుమారుడు హరీష్‌కు తెలుగుదేశం పార్టీపై ఉన్న అభిమానంతో వాళ్ల పూర్వీకులకు చెందిన భూమిని టిడిపి భవన నిర్మాణం కోసం విరాళంగా ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేరు మీద సర్వే నెంబరు 2911/2000 ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు. 2011లో ఈ భూమిని ఫోర్జరీ సంతకాలతో బాపట్ల పట్టణ వెంగల్ విహార్‌కు చెందిన నిర్మలాదేవికి ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. అనంతరం ఆమె తన కుమారుడుకి రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయంపై అప్పటి ఎమ్మార్వో వైఎస్ వికెజిఎస్ఎల్.సత్యనారాయణరావు బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నిర్మలాదేవి, ఆమె కుమారుడు సతీష్, వీరికి సహకరించిన యోహాన్, సాక్షులుగా ఉన్న జోగి సత్యానందం, గుజ్జర్లపూడి యోసోబు, డాక్యుమెంట్ తయారు చేసిన రైటర్ నందనం నరసింహారావును పోలీసులు అరెస్ట్ చేసి.. రిమాండ్‌కు పంపారు.

అయినప్పటికీ నకిలీ దస్తావేజులను అసలు దస్తావేజులుగా చూపిస్తూ.. సుమారు ఏడు అక్రమ రిజిస్ట్రేషన్‌లకు పాల్పడ్డారు. తెలుగుదేశం పార్టీ బాపట్ల పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు గుర్తించి.. అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బాపట్ల పట్టణం వెంగళ విహార్‌కి చెందిన కారుమూరి సత్య వేదం, యాదవపాలెంకు చెందిన బుడ్డి శ్రీనివాసరావు, చీరాల ఉడ్‌నగర్‌కు చెందిన నక్కల శ్రీనివాసులు, నక్కల లలిత, చీరాల మండలం, కావూరువారిపాలెంకు చెందిన కోటా శివారెడ్డి, చీరాల మండలం, గవినివారిపాలెంకు చెందిన వుప్పాల కోటేశ్వరరావు, బాపట్ల మండలం, కొత్త వాడరేవుకు చెందిన నక్కల సత్తార్‌రెడ్డి, బాపట్ల పట్టణం, ఉప్పరపాలెంకు చెందిన నందనం నరసింహారావును అరెస్టు చేసి.. రిమాండ్‌కు పంపినట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితుల వద్ద నుండి అక్రమ రిజిస్ట్రేషన్లకు చెందిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



గుంతకల్లులో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు


- పలు రైళ్లు తాత్కాలికంగా నిలిపివేత

ప్రజాశక్తి-గుంతకల్లు

గుంతకల్లు ప్రధాన రైల్వే జంక్షన్ సమీపంలోని దక్షిణ క్యాబీను వద్ద గుత్తి వైపు ఖాళీ(ర్యాకులు)వ్యాగిన్లతో వెళ్తున్న గూడ్స్ బండి మంగళవారం రాత్రి పట్టాలు తప్పింది. దోర్నగల్లు జిందాల్ ఫ్యాక్టరీ నుంచి ఖాళీ (ర్యాకులు) వ్యాగిన్లతో గుత్తి వైపు వెళుతున్న రైలు గుంతకల్లు రైల్వే ప్రధాన జంక్షన్ వద్ద ఉన్న దక్షిణ క్యాబీను వద్దకు రాగానే ఇంజన్ నుంచి 12, 13 వ్యాగీన్ల కప్లింగ్లు ఊడిపోవడంతో పట్టాలు తప్పింది. అప్రమత్తమైన లోకో పైలెట్ వెంటనే రైలును నిలిపివేశారు. ఇదే సమయంలో రైళ్ల రాకపోకలను తాత్కాలికంగా అధికారులు నిలుపుదల చేశారు. ప్రమాద సమయంలో బెంగళూరు నుంచి గుంతకల్లు వస్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలును నక్కనదొడ్డి రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. రెండుగంటల పాటు మరమ్మతులు చేపట్టి ట్రాక్ పునరుద్ధరణ చేశారు. అనంతరం ఆ మార్గంలో వెళ్లే రైళ్లను యథావిధిగా నడిపారు. ప్రమాద ఘటనపై విచారణ చేపడతామని రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు.

మార్కెట్లకు ఎట్టకేలకు భారీ లాభాలు

- సెన్సెక్స్ 1397 పాయింట్ల ర్యాలీ
- సుంకాల నిలిపివేత ప్రభావం



ముంబయి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై విధించిన సుంకాల పెంపును తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రకటించడం భారత మార్కెట్లకు మద్దతునిచ్చింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఆర్‌బిఐ వడ్డీ రేట్లు తగ్గించొచ్చనే అంచనాలు తదితర కారణాలు దలాల్ స్ట్రీట్ భారీ లాభాలకు కలిసివచ్చాయి. దీంతో ఇటీవల కాలంలో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న మార్కెట్లకు ఎట్టకేలకు ఉపశమనం లభించినట్లయ్యింది. ఈ నేపథ్యంలోనే మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 1397 పాయింట్లు లేదా 1.81 శాతం పెరిగి 78,583కి చేరింది. ఇంట్రాడేలో దాదాపు 1450 పాయింట్లు లాభపడి 78,659 గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 50 సూచీ 387 పాయింట్లు లాభపడి 23,739 స్థాయి వద్ద ముగిసింది. కెనడా, మెక్సికో దేశాలపై విధించిన టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించడంతో మార్కెట్లలో విశ్వాసం పెరిగింది. బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.5.5 లక్షల కోట్లు పెరిగి రూ.425 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ఎల్అండ్‌టి, ఇండస్ ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, రిలయన్స్ సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉండగా.. మరోవైపు ఐటిసి హోటల్స్, జొమాటో, నెస్లే ఇండియా, హిందుస్థాన్ యూనిలీవర్, మారుతీ సుజుకి సూచీలు అధిక నష్టాలు చవి చూసిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

ఆఫీసుకు తప్పక రావాల్సిందే..

- ఉద్యోగులకు డెల్ అదేశాలు

న్యూఢిల్లీ : కరోనా సమయంలో మొదలైన ఇంటి నుంచి పని విధానం, ఆ తర్వాత హైబ్రిడ్ పద్ధతికి కార్పొరేట్ కంపెనీలు వరుసగా ఫుల్‌స్టాప్ పెడుతున్నాయి. తాజాగా వర్క్ ఫ్రమ్ హోమ్, హైబ్రిడ్ వర్క్ సదుపాయాన్ని ఎత్తివేస్తున్నట్లు టెక్ కంపెనీ డెల్ స్పష్టం చేసింది. ఈ విధానానికి శాశ్వతంగా స్వస్తి పలుకుతున్నట్లు వెల్లడించింది. మార్చి 3వ తేదీ నుంచి ఈ నిబంధన అమలులోకి వస్తుందని డెల్ సిఇఒ మైఖెల్ డెల్ తెలిపారు. ఉద్యోగులు వారానికి ఐదు రోజులు ఆఫీసుకు రావాల్సిందేనని పేర్కొన్నారు.. డెల్ కార్యాలయాలకు సమీపంలో గంట ప్రయాణ సమయం ఉన్న ఉద్యోగులకు ఈ కొత్త ఆదేశాలు వర్తిస్తాయన్నారు.. మరింత దూరంలో నివసించే ఉద్యోగులు రిమోట్‌గా పనిచేసేందుకు సీనియర్ లీడర్ల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు.

యూనివర్సల్ బ్యాంకింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు

- ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బి వెల్లడి

బెంగళూరు : యూనివర్శల్ బ్యాంకింగ్ లైసెన్స్ కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు దరఖాస్తు చేసుకున్నట్లు ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వెల్లడించింది. బెంగళూరుకు చెందిన ఈ బ్యాంకు తన వ్యాపారాన్ని విస్తరించడం, రుణ పోర్ట్‌ఫోలియోను బలోపేతం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. జనవరిలో సమర్పించిన ఈ దరఖాస్తుకు బ్యాంక్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదం లభించిందని ఆ బ్యాంక్ ఎండి, సిఇఒ సంజీవ్ నటియల పేర్కొన్నారు. యూనివర్సల్ బ్యాంకింగ్ లైసెన్స్ లభిస్తే.. తమ సంస్థను మరింత పటిష్టం చేయడానికి.. దేశ వ్యాప్తంగా విస్తరించడానికి మద్దతు లభించనుందన్నారు.

షార్ప్ చేతికి ఎన్ఇసి డిస్ప్లే వ్యాపారం

న్యూఢిల్లీ : ఎన్ఇసి ఇండియా డిస్ప్లే వ్యాపారాన్ని సొంతం చేసుకున్నట్లు షార్ప్ బిజినెస్ సిస్టమ్స్ (ఇండియా) తెలిపింది. తద్వారా భారతదేశ విజువల్ సొల్యూషన్స్ మార్కెట్‌ను విప్లవాత్మకంగా మార్చనున్నట్లు ఆ కంపెనీ విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ విలీనం షార్ప్, ఎన్ఇసి రెండింటి ప్రస్తుత భాగస్వాముల కోసం ఉత్పత్తి పోర్ట్‌ఫోలియో విలువను పెంచనుందని పేర్కొంది. ప్రస్తుతం షార్ప్ సంస్థ డిజిటల్ మల్టీఫంక్షనల్ ప్రింటర్లు, ఇంటరాక్టివ్ వైట్ బోర్డ్‌లు, డైనాబుక్ ల్యాప్‌టాప్‌లతో సహా స్మార్ట్ బిజినెస్ సొల్యూషన్స్ వర్టికల్‌లో విస్తృత శ్రేణి ఉత్పత్తులను కలిగి ఉంది. ఎన్ఇసి డిస్ప్లే బిజినెస్‌తో కలువడం ద్వారా తమ ప్రస్తుత ఆఫర్‌లను మరింత మెరుగుపరుస్తుందని షార్ప్ బిజినెస్ సిస్టమ్స్ (ఇండియా) ఎండి ఒసాము నరిటా పేర్కొన్నారు.

సంపాదకీయం

స్ఫూర్తిదాయకం

నిబద్ధ రాజకీయ విధానం కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర 27వ మహాసభ విజయవంతం కావడం అభ్యుదయ శక్తులకు స్ఫూర్తిదాయకం. భరతమాత ముద్దుబిడ్డ, పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య పుట్టిన నెల్లూరు గడ్డపై మూడు రోజులపాటు నిర్వహించిన ఈ మహాసభ పలువిధాలుగా ప్రత్యేకత సంతరించుకున్నది. అర్హతల కమిటీ విశ్లేషణ ప్రకారం మహాసభకు హాజరైన 472 మందిలో 73 శాతం మంది వివిధ ప్రజాపోరాటాల్లో పాల్గొని, అరెస్టులను ఎదుర్కొన్నవారు కావటం ఆ పార్టీ సమరశీలతకు అద్దం పడుతోంది. హాజరైనవారిలో 76 శాతం ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బిసి తరగతుల నుంచి రావడం, 43 శాతం మంది 50 ఏళ్ల లోపు వారు కావడం సంతోషదాయకం. గత పదేళ్లకుపైగా కేంద్రంలో అధికారంలో వుంటూ రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన, చేస్తున్న బిజెపిని ఎదుర్కోవాలని, ఎన్‌డిఎలో భాగస్వామిగా వుంటూ కార్పొరేట్లకు అనుకూలంగానూ, సామాన్య ప్రజలపై అదనపు భారాలు మోపుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని మహాసభ ప్రజలకు పిలుపునివ్వడం సముచితమైనది. రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్, దాని విభాగాలు ఒక పథకం ప్రకారం విస్తరిస్తున్నాయి. దేవాలయాలను రాజకీయ కేంద్రాలుగా మార్చాలని యత్నిస్తున్న మాట నిజమే! ఈ నేపథ్యంలో పెరుగుతున్న మతోన్మాద ప్రమాదాన్ని ప్రతిఘటించేందుకు, మత సామరస్య పరిరక్షణ కోసం కలిసి రావాలని లౌకిక, ప్రజాతంత్ర శక్తులకు విజ్ఞప్తి చేయడం సిపిఎం ఆచరణాత్మక దృక్పథానికి ఓ సూచిక.

కేంద్రం చెబుతున్న వికసిత్ భారత్ నమూనాలో స్వర్ణాంధ్ర విజన్ 2047 పేరిట ముఖ్యమంత్రి విడుదల చేసిన డాక్యుమెంటులో గతంలోని పిపిపి స్థానంలో ఇపుడు పి-4 అంటూ ప్రజల సంపదను, ఊరుమ్మడి ఆస్తులను సంపన్నులకు కట్టబెట్టే విధానమన్న మహాసభ విశ్లేషణ సరైనదే! అదాని గ్రూప్ కంపెనీలతో సెకి ద్వారా గత వైసిపి ప్రభుత్వం కుదుర్చుకున్న అవినీతి ఒప్పందాలపై అమెరికా కోర్టులో కేసు నమోదైనా, ప్రజలపై లక్షల కోట్లు భారంవేసే ఆ అవినీతి ఒప్పందాలను టిడిపి కూటమి ప్రభుత్వం రద్దు చేయ నిరాకరించడంతో ఈ విషయంలో మోడీ- జగన్- చంద్రబాబు- పవన్ ఒక్కటేనని రుజువవుతోందన్న ఆ పార్టీ నిర్ధారణను ఎవరూ కాదనలేరు. నూతన ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిని అమరావతిలో నిర్మించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నది నిర్వివాదాంశం. రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే వివిధ పరిశ్రమలు, ప్రాజెక్టులను వికేంద్రీకరించాలని, తక్షణం పూర్తి చేయగలిగిన సాగునీటి ప్రాజెక్టులకు నిధులిచ్చి పూర్తి చేయాలని, టిడిపి కూటమి ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేయాలన్న మహాసభ డిమాండ్లు న్యాయసమ్మతమైనవి.

తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమానికి గొప్ప పోరాట సాంప్రదాయమున్నది. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ప్రత్యేకించి గతంలో కరోనా సమయంలోను, ఇటీవల వరద ముంపు, తుపాను సంభవించినపుడు సేవా, సహాయ కార్యక్రమాలు నిర్వహించి ప్రజల మన్ననలను చూరగొన్నది. చారిత్రాత్మక రైతు పోరాటం, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం, ప్రత్యేక హోదా, పోలవరం, వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి, తదితర పోరాటాలను బలపర్చడంలో సిపిఎం ముందున్నది. కార్మిక హక్కుల కోసం నిలబడింది. ఉపాధ్యాయ, ఉద్యోగులకు అండగా ఉంటోంది. కులవివక్షకు వ్యతిరేకంగా, గిరిజన హక్కుల పరిరక్షణకు కృషి చేసింది. ఈ పోరాట వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకుపోయి క్షేత్ర స్థాయిలో బలమైన ఉద్యమాలను నిర్మించేందుకు పూనుకుంటుందని, ప్రజలకు అండగా ఉంటుందని ఈ మహాసభ హామీనివ్వడం సంతోషదాయకం. పార్టీ స్వతంత్ర ప్రజా పునాది బలపడేందుకు నిర్మాణ చర్యలు తీసుకుంటుందనీ, ప్రజల ఆలోచనా ధోరణిని పెడదారి పట్టిస్తున్న మతోన్మాదం, కార్పొరేట్ విష సంస్కృతికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ప్రజా సాంస్కృతికోద్యమాన్ని నిర్మించడానికి కృషి చేయాలనడం మంచి విషయం. లౌకికవాద పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కులు, మత సామరస్యం, రాష్ట్రానికి నిధులు, ఫెడరల్ హక్కుల కోసం అన్ని పార్టీల వెనకనున్న ప్రజానీకం ఐక్యంగా నిలబడాలని ఈ మహాసభ చేసిన విజ్ఞప్తికి అందరూ సానుకూలంగా స్పందిస్తారని ఆశిద్దాం!

మహనీయుల మాట



కళ
ప్రజా చైతన్యం
కోసమే.
- గరికపాటి రాజారావు,
ప్రజానాట్య మండలి
వ్యవస్థాపకుడు,
తెలుగు సినీ దర్శకుడు.
జననం : 5.2.1915
మరణం : 8.9.1963

వాణిజ్య పోరుకు తెర తీసిన ట్రంప్

అంతర్జాతీయం

అమెరికా విధించే పన్నులు ఎలా ఉండబోతున్నాయి? సామాన్యుల మీద ఎంత భారం పడుతుందన్నది ఇప్పుడు పెద్ద చర్చగా ఉంది. టాక్స్ ఫౌండేషన్ సంస్థ చెబుతున్నదానిని బట్టి కెనడా, మెక్సికోల మీద పన్ను కారణంగా అమెరికా జిడిపి 0.8 శాతం దిగజారుతుంది. 1.3 ఎగుమతులు, 2.8 శాతాల చొప్పున దిగుమతులు తగ్గుతాయి. లక్షా 84 వేల ఉద్యోగాలు పోతాయి. ఎంత భారం పడుతుందనే లెక్కలు అన్నీ ఒకే విధంగా లేవు. పన్ను మొత్తం 272 బిలియన్ డాలర్లు ఉంటే కుటుంబానికి ఏటా 2,600 డాలర్లు అదనపు భారం అని కార్నే క్రాస్ బోర్డర్ సొల్యూషన్స్ పేర్కొన్నది. చైనా వస్తువులపై 60 శాతం, మిగతా వాటిపై 20 శాతం విధిస్తే ఏటా కుటుంబం మీద 2,600 డాలర్ల భారమని పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్, మొత్తం మీద పది శాతం విధిస్తే 2,045 డాలర్లని టాక్స్ ఫౌండేషన్, 7,600 డాలర్లు ఉంటుందని నేషనల్ రిటెయిల్ ఫెడరేషన్ అంచనా. ఈ పన్నులతో కంపెనీలు, వినియోగదారుల నుంచి ప్రతిఘటన ఎదురు కావచ్చని కూడా చెబుతున్నారు.



డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ముందు నుంచీ ప్రకటించినట్లుగానే ప్రపంచ వాణిజ్య పోరుకు తెర తీశాడు. తన పన్నులను వ్యతిరేకించే విదేశమైనా లేక అమెరికాలో ఉన్న కంపెనీ అయినా సరే వారంతా చైనా అదుపులో ఉన్నట్లే అన్నాడు. ఇది రాసిన సమయంలో చెప్పిన మాటలకు, పాఠకులకు చేరే సమయానికి మార్పులు, విస్తరణ జరిగే రీతిలో ట్రంప్ వేగం కనిపిస్తోంది. కెనడా, మెక్సికోల మీద విధించిన పన్నుల అమలు కొంత కాలం వాయిదా వేస్తామనంటతో పాటు 'ఐరోపా మీద త్వరలో విధిస్తా, వారు అమెరికా పట్ల భయంకరంగా వ్యవహరించారు, లాభాలకు ఒక అవకాశంగా తీసుకున్నారు, చైనా మీద ప్రకటించిన మొత్తాన్ని పెంచుతా' అన్నాడు. స్వంత జనాలు, కంపెనీలతో పాటు ప్రపంచ వృద్ధికి నష్టం. అమెరికా పలుకుబడికీ దెబ్బ అన్న అనేక మంది ఆర్థికవేత్తల హెచ్చరికలను ఖాతరు చేయటం లేదు. కెనడా, మెక్సికోలపై 25 శాతం, చైనా వస్తు దిగుమతుల మీద పది శాతం పన్ను విధిస్తూ ఫిబ్రవరి ఒకటవ తేదీన ఉత్తర్వులు జారీ చేశాడు. ఇప్పటి వరకు వెల్లడైన వైఖరులను చూస్తే అదిరించి బెదిరించి దారికి తెచ్చుకోవాలన్న ఎత్తుగడ కనిపిస్తోంది. పన్నులను వ్యతిరేకిస్తున్న వారు ఎవరైనా కుహనా వార్తల వాల్‌స్ట్రీట్ జర్నల్, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే (హెడ్జ్ ఫండ్స్) వారు లేదా సంస్థలు చైనా అదుపుల్లో ఉన్నట్లే అన్నాడు. తన నిర్ణయాలకు అద్భుత స్పందన వస్తున్నదని చెప్పుకున్నాడు. ఇతర దేశాలకు రాయితీల రూపంలో అమెరికా లక్షల కోట్ల డాలర్లు నష్టపోతున్నదన్నాడు. జనాలకు ఆర్థికంగా కొంత నొప్పి కలగవచ్చుగానీ అమెరికా ప్రయోజనాలకు ఆ మాత్రం భరించక తప్పదన్నాడు. దక్షిణాఫ్రికా భూములను గుంజుకుంటున్నదని, కొన్ని సామాజిక తరగతుల పట్ల చెడుగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, ఆ దేశానికి రానున్న రోజుల్లో నిధులు నిలిపివేస్తామని, గతంలో ఇచ్చిన వాటి మీద దర్యాప్తు చేస్తామని చెప్పాడు.



ఎం. కోటేశ్వరరావు

ఖండనలతో పాటు యావత్ ప్రపంచం అప్రమత్తమై ఎలా ఎదుర్కోవాలా అన్న శోధనలో పడింది. అక్రమంగా దిగుమతి అవుతున్న ఫెంటానిల్ నిరోధానికి జాతీయ అత్యవసర పరిస్థితిని ట్రంప్ ప్రకటించాడు. కృత్రిమ సింథటిక్, నల్లమందుతో తయారు చేసే నొప్పి నివారణ, మత్తు మందును ఫెంటానిల్ అని పిలుస్తున్నారు. దీన్ని ఔషధంగా వినియోగించటానికి అనుమతి ఉంది. మాదక ద్రవ్యంగా కూడా వినియోగిస్తున్నారు. అక్రమంగా దిగుమతి అవుతున్న ఫెంటానిల్ అమెరికాలో లక్షల మంది ప్రాణాలు తీసిందని అధ్యక్ష భవన మీడియా కార్యదర్శి కారోలిన్ లీవిట్ ఆరోపించారు. డొనాల్డ్ ట్రంప్ అంటే అమెరికా, అమెరికా అంటే ట్రంప్ అన్నట్లుగా పరిస్థితి తయారు కావటంతో కొంత మంది ఇప్పుడు 'ట్రంపెరికా' అని పిలుస్తున్నారు. తాము చర్చలను తప్ప ఘర్షణను కోరుకోలేదని, కానీ ప్రతికూల చర్యలకు పూనుకోక తప్పటంలేదని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షియిన్‌బామ్ ఎక్స్ ద్వారా ప్రకటించారు. మెక్సికో ప్రయోజనాల రక్షణకు అవసరమైన చర్యలన్నింటినీ తీసుకోవాలని తమ ఆర్థిక మంత్రిని కోరినట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల ముఠాలతో మెక్సికో ప్రభుత్వం కుమ్మక్కు అయినందునే తాము పన్నులు విధించాల్సి వస్తోందంటూ అధ్యక్ష భవనం చెప్పిన సాకును ఆమె ఖండించారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే ఏఏ వస్తువులను లక్ష్యంగా చేసుకోవాలో ఇంకా వెల్లడించలేదు. స్వతంత్ర మెక్సికో చరిత్రలో జరిగిన అతి పెద్ద దాడులలో ఇదొకటని, అమెరికా-కెనడా-మెక్సికో కుదుర్చుకున్న ఒప్పందానికి ఇది విరుద్ధమని పాలక పార్టీ నేత రికార్డో, ఆర్థిక మంత్రి ఎబ్రార్డ్ ప్రకటించాడు. తాము నష్టపడతామని, వారికీ అదే జరుగుతుందన్నారు. ప్రస్తుతం అమెరికాకు ఎగుమతుల్లో చైనాతో మెక్సికో పోటీ పడుతోంది. మూడో వంతు మెక్సికో జిడిపి అమెరికాకు ఎగుమతులపై ఆధారపడి ఉంది. ఎగుమతి, దిగుమతుల్లో మెక్సికో వాణిజ్య మిగుల్లో ఉంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకొనే పంది మాంసం, జున్ను, వ్యవసాయ ఉత్పత్తులు, ఉక్కు, అల్యూమినియం వస్తువుల మీద ఐదు నుంచి 20 శాతం వరకు పన్నులు విధించాలని ఆలోచిస్తున్నది. బీరు, వైన్, పండ్లు, పండ్ల రసాలతో సహా అమెరికా నుంచి వచ్చే వస్తువులపై 25 శాతం పన్ను విధించనున్నట్లు కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడేవ్ ప్రకటించాడు. తొమ్మిది వేల కిలోమీటర్ల దూరం ఉన్న సరిహద్దులో ఇరు దేశాల వాణిజ్య లావాదేవీలు రోజుకు రెండున్నర బిలియన్ల డాలర్ల మేర జరుగుతున్నాయి. పన్నుల విధింపు తమ మీద ఆర్థిక యుద్ధం ప్రకటించటం, రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక బంధాన్ని ఉల్లంఘించటమే అంటూ దీన్ని తాము, కెనడియన్లతో కలసి ప్రతిఘటిస్తామని బ్రిటీష్ కొలంబియా ప్రధాని డేవిడ్ ఇబై ప్రకటించాడు. డాలర్‌కు డాలర్ అన్న పద్ధతిలో దెబ్బ తీస్తామని కెనడాలోని ఓంటారియో రాష్ట్ర నేతలు చెప్పారు. తమ మీద అడ్డగోలుగా పన్ను విధిస్తే గట్టిగా ప్రతిస్పందిస్తామని ఐరోపా యూనియన్ ప్రతినిధి వ్యాఖ్యానించాడు.

ట్రంప్ చర్యను ఖండిస్తూ చర్చలకు ద్వారాలను తెరిచే ఉంచామని చైనా వాణిజ్య, ఆర్థిక మంత్రిత్వ శాఖలు ప్రకటించాయి. ప్రపంచ వాణిజ్య సంస్థలో పన్నుల విధింపును సవాలు చేస్తామని ప్రకటించాయి. ఫెంటానిల్ అమెరికా సమస్య. దాని మీద ఏ చర్య తీసుకున్నా తాము మద్దతు ఇస్తామని చైనా స్పష్టం చేసింది. తాము ఇప్పటికే అమెరికాకు సహకరిస్తున్నామని, గణనీయమైన ఫలితాలు కూడా వచ్చాయన్నారు. ట్రంప్ పన్నులు చైనా ఆర్థిక వ్యవస్థకు పెద్ద దెబ్బ కాదని వాణిజ్య రంగ నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆర్థిక రంగం మీద అమెరికా పన్నులు ఎలాంటి ప్రభావితం కలిగిస్తాయో అన్న ఆందోళన చెందుతున్నట్లు జపాన్ ఆర్థిక మంత్రి కాటో చెప్పాడు. తమ మీద ప్రభావం ఎలా ఉంటుందో చూసి తగిన చర్యలు తీసుకుంటామన్నాడు. మెక్సికోలో ఉత్పత్తి కేంద్రాలున్న దక్షిణ కొరియా కంపెనీల మీద ఎలాంటి ప్రభావం పడుతుందో సన్నిహితంగా గమనించాలని ఆ దేశ తాత్కాలిక అధ్యక్షుడు చోయ్ శాంగ్ మోక్ ప్రభుత్వ సంస్థలను ఆదేశించాడు. కొన్ని కంపెనీలు అమెరికాలో ఉత్పత్తి జరపాలని ఆలోచిస్తున్నాయి. పిజా, కార్ల ధరలు పెరుగుతాయి సిద్ధంగా ఉండండి అంటూ అమెరికా సెనెట్‌లో ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ సెనెటర్ చార్లెస్ షుమర్ హెచ్చరించాడు. కార్ల విడి భాగాల దిగుమతులపై పన్ను విధించి ధరలు పెరిగేందుకు దోహదం చేయవద్దని అమెరికన్ ఆటోమోటివ్ పాలసీ మండలి అధ్యక్షుడు మాట్ బ్లంట్ కోరాడు. పరిణామాలు, పర్యవసానాలను ఎదుర్కొనేందుకు భారత్‌తో సహా వర్ధమాన దేశాలన్నీ సిద్ధం కావాలని కోటక్ మహీంద్ర బ్యాంక్ స్థాపకుడు ఉదయ్ కోటక్ కోరారు. తమకు నష్టం చేసే దేశాలన్నింటి మీద పన్నులు వేస్తానని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికా వస్తువులను అన్యాయంగా భారత్ అడ్డుకుంటున్నదని ఆరోపించాడు.


ట్రంప్ పన్నులతో జరిగేదేమిటి అన్న చర్చ ఎన్నికలకు ముందే ప్రారంభమైంది. బస్తీ మే సవాల్ అంటూ అన్ని దేశాల మీద తొడగొట్టిన కారణంగా మిగతా దేశాలన్నింటికీ కలిపి ఎంత నష్టం జరుగుతుందో ఒక్క అమెరికాకు అంత ఉంటుంది. ఏ ఏ వస్తువుల మీద పన్నులు విధిస్తారు, చేసిన ప్రకటనలు, ఇచ్చిన ఆదేశాలకు ట్రంప్ కట్టుబడి ఉంటాడా అన్నది కూడా చూడాల్సి ఉంది. బెదిరించటం వెనక్కు తగ్గటం అతని చరిత్ర. తొలిసారి అధికారానికి వచ్చినపుడు అక్రమ వలసలను నివారించటంలో విఫలమైనందున మెక్సికో వస్తువులపై ఐదు నుంచి 25 శాతం పన్నులు విధిస్తానని ప్రకటించాడు. తరువాత వెనక్కు తగ్గాడు. నిఘంటువులో దేవుడు, ప్రేమ, మతం తరువాత అందమైన పదం పన్నులు అని ట్రంప్ వర్ణించాడు. అమెరికా చరిత్రలో 1890 దశకంలో 25వ అధ్యక్షుడు విలియమ్ మెకన్లీ ఎడా పెడా పన్నులు విధించిన నేతగా నమోదయ్యాడు. ఇప్పుడు ట్రంప్ అదే బాటలో నడుస్తున్నట్లు వర్ణిస్తున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున లోటు బడ్జెట్‌తో ఉండగా పన్నులు తగ్గించాలని ట్రంప్ తలపెట్టాడు. తద్వారా వచ్చిన నష్టాన్ని విదేశీ దిగుమతులపై పన్ను విధింపుతో పూడ్చాలని చూస్తున్నాడు. అయితే దానికి దేశ కార్మిక వర్గాన్ని ఫణంగా పెట్టాలని చూస్తున్నాడు. దిగుమతి పన్నులు వేల కోట్ల డాలర్లు బహుశా లక్షల కోట్లు కూడా తమ ఖజానాలోకి వచ్చిపడవచ్చని ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాల్లో ట్రంప్ చెప్పాడు.

అమెరికా విధించే పన్నులు ఎలా ఉండబోతున్నాయి? సామాన్యుల మీద ఎంత భారం పడుతుందన్నది ఇప్పుడు పెద్ద చర్చగా ఉంది. టాక్స్ ఫౌండేషన్ సంస్థ చెబుతున్నదానిని బట్టి కెనడా, మెక్సికోల మీద పన్ను కారణంగా అమెరికా జిడిపి 0.8 శాతం దిగజారుతుంది. 1.3 ఎగుమతులు, 2.8 శాతాల చొప్పున దిగుమతులు తగ్గుతాయి. లక్షా 84 వేల ఉద్యోగాలు పోతాయి. ఎంత భారం పడుతుందనే లెక్కలు అన్నీ ఒకే విధంగా లేవు. పన్ను మొత్తం 272 బిలియన్ డాలర్లు ఉంటే కుటుంబానికి ఏటా 2,600 డాలర్లు అదనపు భారం అని కార్నే క్రాస్ బోర్డర్ సొల్యూషన్స్ పేర్కొన్నది. కెనడా, మెక్సికో దిగుమతుల మీద 25 శాతం చొప్పున అమలు చేస్తే 232.5 బి.డాలర్లు, చైనా వస్తువులపై 43.2 మొత్తం 275.7 బి.డాలర్లని దీని ప్రకారం 33 కోట్ల జనాభాలో తలకు 835 డాలర్ల చొప్పున నలుగురున్న ప్రతి కుటుంబం మీద 3,342 డాలర్లని మరో లెక్క. చైనా వస్తువులపై 60 శాతం, మిగతా వాటిపై 20 శాతం విధిస్తే ఏటా కుటుంబం మీద 2,600 డాలర్ల భారమని పీటర్సన్ ఇన్‌స్టిట్యూట్, మొత్తం మీద పది శాతం విధిస్తే 2,045 డాలర్లని టాక్స్ ఫౌండేషన్, 7,600 డాలర్లు ఉంటుందని నేషనల్ రిటెయిల్ ఫెడరేషన్ అంచనా. ఈ పన్నులతో కంపెనీలు, వినియోగదారుల నుంచి ప్రతిఘటన ఎదురు కావచ్చని కూడా చెబుతున్నారు. తొలిసారి అధికారానికి వచ్చినపుడు ట్రంప్ విధించిన పన్నులకు ప్రతిగా ఐరోపా యూనియన్, చైనా చర్యలు తీసుకున్నాయి. వ్యవసాయ రంగంలో ట్రంప్ మద్దతుదార్లు, ఇతరులూ నష్టపోయారు. జూరిచ్ విశ్వవిద్యాలయం, మసాచుసెట్స్, హార్వర్డ్, ప్రపంచ బ్యాంకు చేసిన అధ్యయనాల ప్రకారం ట్రంప్ విధించిన పన్నులు అమెరికాలో ఉపాధిని పునరుద్ధరించలేదని అలాగని ఉపాధిని తగ్గించలేదని కూడా తేలింది. అందువలన ఇప్పుడు ట్రంప్ చెబుతున్న మాటలు, చేతల ప్రభావం, పరిణామాలు, పర్యవసానాలు వెంటనే వెల్లడయ్యే అవకాశాలు లేవు. భారత్‌తో సహా వివిధ దేశాలలో స్టాక్ మార్కెట్లు, కరెన్సీ విలువల్లో ఒడుదుడుకులు మాత్రం కనిపిస్తున్నాయి.

పేదరికాన్ని కాదు...పేదల్ని నిర్మూలించే బడ్జెట్

విశ్లేషణ

నిర్మలా సీతారామన్ తెలుగింటి కోడలు. ఆమె గురజాడ మాటల్ని ఉటంకిస్తూ ప్రసంగాన్ని ప్రారంభించారు. తిండి కలిగితే కండ కలదోయ్..కండ కలవాడే మనిషోయ్ అన్నాడు గురజాడ. తిండేది? కండేది? ఈ బడ్జెట్ ఆకలి చావులను పెంచే బడ్జెట్. నిరుద్యోగాన్ని పెంచే బడ్జెట్. కొనుగోలు శక్తిని తగ్గించే బడ్జెట్. అసమానతలను పెంచే బడ్జెట్. వలసలను పెంచే బడ్జెట్. కార్పొరేట్లు తయారు చేస్తే ఆర్.ఎస్.ఎస్ డైరెక్షన్‌లో పార్లమెంట్‌లో చదివిన బడ్జెట్ ఇది.



నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంబానీ, అదానీ, కార్పొరేట్ల కోసమే అన్నట్టుగా ఉంది. గతంతో పోల్చుకుంటే మన బడ్జెట్ సైజు ఐదు శాతం పెరిగింది. ప్రతి పద్దుకూ ఐదు శాతం కేటాయింపులు పెరిగితే.. పోయినసారి కేటాయింపులతో సమానంగా ఉంటుంది. ఉత్పత్తి వర్గాలైన గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, వ్యవసాయ కార్మికులు, పట్టణ ప్రాంతాల్లోని అసంఘటిత కార్మికులు, కార్మికులు, సామాజికంగా దళితులు, గిరిజనులు, మైనార్టీలు, ఓబీసీలు, మహిళలకు కేటాయింపు ఎలా ఉందనేది చూడాలి. వారిని అడ్రెస్ చేయకుండా ఎన్ని కేటాయింపులు చేసినా నిరుపయోగం. ఎంత గొప్ప పదాలు ఉపయోగించినా ప్రయోజనం లేదు.

ఉపాధి హామీకి గత బడ్జెట్లో రూ.86 వేల కోట్లు ఇచ్చారు. సవరించిన దాంట్లో 86 వేల కోట్లే. ఇప్పుడు కూడా 86 వేల కోట్ల రూపాయలే. ఐదు శాతం పెంచాలంటే సుమారు రూ.90 వేల కోట్లు ఇవ్వాలి. ఉపాధి హామీ చట్టానికి కనీసం రూ.2.5 లక్షల కోట్లు కేటాయిస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు తగ్గుతాయి. కొనుగోలు శక్తి పెరుగుతుంది. ఉపాధి హామీ అంటే ఏమిటి? మోడీ దృష్టిలో ఉపాధి అంటే అంబానీ, అదానీ, కార్పొరేట్లకు ఉపాధి కల్పించడం.

పేదరికాన్ని నిర్మూలించాలంటే ఆహార భద్రతకు ఎక్కువ నిధులు కేటాయించాలి. 24 కోట్ల రేషన్ కార్డుల్లో 84 కోట్ల మంది ఆహార భద్రత మీద ఆధారపడి జీవిస్తున్నారు. గతంలో రూ.2.70 లక్షల కోట్లు ఇచ్చారు. మోడీ ప్రభుత్వం క్రమంగా తగ్గిస్తూ తగ్గిస్తూ పోయినేడాది రూ.2.03 లక్షల కోట్లకు కుదించింది. సవరించిన అంచనాల్లో రూ.1.97 లక్షల కోట్లకు కుదించారు. ఇక అంతకంటే ఎక్కువ కేటాయించ లేనని మోడీ సర్కార్ చెప్పేసింది. ఇప్పుడు రూ.2.04 లక్షల కోట్లు ఇచ్చేస్తున్నాం అని ప్రకటించింది. పేదరికం లేని భారతాన్ని ఎలా సృష్టిస్తారు?



బి. వెంకట్

దేశంలో 65 శాతం ప్రజలు గ్రామీణ ప్రాంతంలో ఉన్నారు. పోయిన సంవత్సరం గ్రామాలకు రూ.2.60 లక్షల కోట్లు కేటాయించింది. ఖర్చు పెట్టింది 1.90 లక్షల కోట్ల రూపాయలే. అంటే, రూ.75 వేల కోట్లను గ్రామాల అభివృద్ధికి ఇక ఖర్చు పెట్టలేమని పార్లమెంట్ సాక్షిగా మోడీ సర్కారు తెగించి చెప్పింది. వ్యాధులకు ప్రధాన కారణం తాగు నీరు శుభ్రంగా లేకపోవడం, సరైన ఆహారం అందకపోవడమేనని ఐక్యరాజ్యసమితి ఘోషిస్తున్నది. పోయిన సంవత్సరం జల్ జీవన్ (రక్షిత తాగునీటి జలాల కోసం)కు రూ.70 వేల కోట్లు కేటాయించి...దాన్ని రూ.22 వేల కోట్లకు సవరించారు. 70 శాతం నిధులనే జల్ జీవన్‌కు వాడారు. ఇప్పుడు రూ.65 వేల కోట్లు కేటాయిస్తున్నట్టు గొప్పగా చెప్పింది. పోయిన సారే ఖర్చు పెట్టలేదు. ఈసారి ఏం ఖర్చు పెడుతుంది?

ఇంకా విచిత్రమైన, ఆందోళనకరమైన అంశాలేమిటంటే రైతులకు అత్యంత ముఖ్యమైనది యూరియా. పోయిన బడ్జెట్‌లో యూరియాకు రూ.1.19 లక్షల కోట్లు కేటాయించి రూ.1.18 లక్షల కోట్లను ఖర్చు చేసింది. ఇప్పుడు 1.18 లక్షల కోట్ల రూపాయలనే ప్రకటించింది. వ్యవసాయానికి సరిగ్గా నిధులు ప్రకటిస్తే రైతు బతుకుతాడు. ఈ ప్రభుత్వానికి అది ఇష్టం లేదు. రైతులు బతికితే కంపెనీలు వ్యవసాయంలోకి రావు. జిడిపిలో రూ.70 లక్షల కోట్ల రూపాయల విలువైన వ్యవసాయ రంగంపై అంబానీ, అదానీ లాంటి బహుళజాతి కంపెనీల దృష్టి పడింది. అందుకే ఫెర్టిలైజర్లకు ఇచ్చే నిధులను పెంచలేదు. రైతులు దివాళా తీస్తే కార్పొరేట్లు వ్యవసాయాన్ని కబ్జా చేయడం సులువవుతందనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కనిపిస్తున్నది. అందుకే వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు తగ్గించిందనే విషయం తేటతెల్లం అవున్నది.

మూడో అంశం..సామాజిక న్యాయం. ఎవరు కాదన్నా అవునన్నా మన దేశంలో కుల వివక్ష ఉంది. మతపరమైన దాడులు జరుగుతున్నాయి. ఇవన్నీ నిర్మూలించాలనే విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలి. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా గ్రామీణ ప్రాంతాలకు రూ.54 వేల కోట్లు కేటాయిస్తే...సిమెంట్, ఐరన్ రేటు పెరిగిన నేపథ్యంలో అవి సరిపోవని నిరసన తెలిపాం. అయినా, సర్కారుకు పట్టలేదు. రూ.32,426 కోట్లు అంటే దాదాపు 40 శాతం నిధులు కేటాయించిన దాంట్లో కత్తిరించి పడేసింది. ఇది అహంభావంతో కూడుకున్నది కాదా? అర్బన్ ప్రాంతానికి సంబంధించి రూ.30 వేల కోట్లు ఇచ్చారు. ఖర్చు పెట్టింది రూ.13,672 కోట్లు మాత్రమే. 60 శాతానికిపైగా నిధులు ఖర్చు పెట్టలేదు. కాగితాల్లో ఇప్పుడు ఇళ్లు కట్టుకునేందుకు రూ.60 వేలు ఇస్తామంటున్నారు? ఏమనాలి ఈ ప్రభుత్వాన్ని? ఇళ్లు ఇవ్వలేని ప్రభుత్వం అనొద్దా? పోయిన సంవత్సరం ఆరోగ్య రంగానికి రూ.89 వేల కోట్లు కేటాయించి రూ.88 వేల కోట్లే ఖర్చు పెట్టారు. విద్యా రంగానికి రూ.1.25 లక్షల కోట్లు కేటాయించి ఖర్చు పెట్టింది రూ.1.14 లక్షల కోట్లే. అంటే సవరించిన దాంట్లో 8 శాతం తగ్గించింది. సాంఘిక సంక్షేమం పట్ల మరింత దుర్మార్గంగా వ్యవహరించింది.

ఈనాటికీ అంటరానితనం విలయ తాండవం చేస్తున్నది. కులాంతర వివాహాలు చేసుకుంటే కులం పేరుతో చంపేస్తున్నారు. ఈ పరిస్థితిని ఎదిరించే శక్తి రావాలంటే సామాజిక న్యాయం కీలకం. పోయినసారి రూ.52 వేల కోట్లు కేటాయించి..సవరణల్లో రూ.46 వేల కోట్లకు తగ్గించారు. అంటే 18 శాతం తగ్గించారు. కేటాయింపుల్లో పేపర్ల మీద బాగా చూపి గ్రామీణ ప్రాంతాలకు, సంక్షేమ రంగాలకు, సామాన్య ప్రజానీకానికి సంబంధించిన నిధుల్లో కేంద్రం నిర్దాక్షిణ్యంగా కోత పెడుతున్నదనేది ముమ్మాటికీ నిజం. రక్షణ శాఖకు పెంచింది. కార్పొరేట్లకు పన్నుల రాయితీ ఎక్కువగా ఇచ్చింది. కార్పొరేట్లకు సవరించిన అంశాల్లో పెంచుకుంటూ పోతున్నది. సామాజిక అంశాలకేమో తగ్గిస్తూ పోతున్నది. ప్రధానమంత్రి పేరుతో ఎస్సీ పిల్లల స్కాలర్ షిప్పుకు పోయినసారి రూ.6,050 కోట్లు కేటాయిస్తే సరిపోవని చెప్పాం. రూ.4,500 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. సవరించిన దాంట్లో 22 శాతం కోత పెట్టారు. ఎస్సీ, ఎస్టీ పిల్లలకు ఇది అన్యాయం చేయడం కాదా? ఆ పిల్లలు ఉన్నత చదువులు చదవొద్దనే కుట్ర దాని వెనుక ఉన్నట్టేగా? ఇది ఆధిపత్య కులాల బడ్జెట్ అని ఎందుకు అనకూడదు? ఇప్పుడు రూ.7 వేల కోట్లు ఇస్తామని గొప్పలు చెప్పకుంటున్నారు. ఎస్టీ పిల్లలకు ఇచ్చింది రూ.4,300 కోట్లు. సరిపోవని వాదించినా ఖర్చు పెట్టింది రూ.3,630 కోట్లే. సవరణ పేరుతో మోడీ సర్కారు కోత కోస్తున్నదనే విషయం స్పష్టమవుతున్నది. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 8 కోట్ల మంది మూడేళ్ల లోపు చిన్నారులున్నారు. కోటిమంది వరకు గర్భిణీలు న్నారు. తల్లికి పౌష్టికాహారం అందిస్తే పిల్లలు ఆరోగ్యంగా పుడతారనే ఉద్దేశంతోనే అంగన్‌వాడీ కేంద్రాలను పెట్టారు. పోషణ్-1, పోషణ్-2 రెండింటికీ బడ్జెట్‌లో కోశారు. గత బడ్జెట్‌లో వైబ్రెంట్ ఇండియా అనే పథకాన్ని పెట్టారు. రూ.1,000 కోట్లు కేటాయించి రూ.209 కోట్లు మాత్రమే ఖర్చుపెట్టారు. వైబ్రెంట్ ఇండియా అంటే ఇదేనా?

కేంద్ర ప్రభుత్వం దేశం మొత్తానికి దుర్మార్గంగా అన్యాయం చేసింది. రాష్ట్ర విభజన సమయంలో కొన్ని హామీలు ఇచ్చారు. అమరావతి కోసం లోన్లు తెచ్చుకోవాలని చెప్పారు. పోలవరంలో కాంట్రాక్టర్లకు ఆగిపోయిన బిల్లులను గుర్తిస్తున్నారు తప్ప నిర్వాసితుల గురించి పట్టించుకోవడం లేదు. భూములు, ఉపాధి కోల్పోయిన గిరిజనుల గురించి మాట్లాడటం లేదు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఇవ్వాల్సిన దానికి నిధులేవి? వెనుకబడ్డ ప్రాంతాలకు నిధులు కేటాయిస్తామన్నారు. వాటికీ బడ్జెట్‌లో నిధులు చూపలేదు. నిర్మలా సీతారామన్ తెలుగింటి కోడలు. ఆమె గురజాడ మాటల్ని ఉటంకిస్తూ ప్రసంగాన్ని ప్రారంభించారు. తిండి కలిగితే కండ కలదోయ్..కండ కలవాడే మనిషోయ్ అన్నాడు గురజాడ. తిండేది? కండేది? ఈ బడ్జెట్ ఆకలి చావులను పెంచే బడ్జెట్. నిరుద్యోగాన్ని పెంచే బడ్జెట్. కొనుగోలు శక్తిని తగ్గించే బడ్జెట్. అసమానతలను పెంచే బడ్జెట్. వలసలను పెంచే బడ్జెట్. కార్పొరేట్లు తయారు చేస్తే ఆర్.ఎస్.ఎస్ డైరెక్షన్‌లో పార్లమెంట్‌లో చదివిన బడ్జెట్ ఇది. అందుకే దేశవ్యాప్తంగా బడ్జెట్ కాపీలను దహనం చేశాం. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో వారం పాటు నిరసనలు చేపడతాం. 5న ఎస్‌కెఎమ్, కార్మిక సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో క్యాంపెయిన్ చేస్తున్నాం. రాజకీయాలకు అతీతంగా ఈ పోరాటంలోకి రావాలి. రెండు తెలుగు రాష్ట్రాధినేతలు మేల్కోవాలి.

/ వ్యాసకర్త అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి /

జనవాక్యం

పనుల వేగం పెరగాలి!

రాష్ట్ర రాజధాని అమరావతికి 57 కిలోమీటర్ల రైలు మార్గం నిర్మాణం పూర్తి కావడానికి నాలుగు సంవత్స రాలు పడుతుందని రైల్వే శాఖ ప్రకటించింది. 57 కిలో మీటర్ల మార్గానికి అంత సుదీర్ఘ కాలం పట్టడం ఆశ్చర్యంగా ఉంది! వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ముఖ్యమంత్రి బుల్లెట్ ట్రైన్ అంటూ ప్రకటనలు చేయడం విడ్డూరంగా ఉంది. నిజానికి ఈ ప్రతిపాదిత మార్గం ఒక రైలు మార్గం నుంచి మరో మార్గానికి అనుసంధా నించడమే. అదీ పూర్తిగా మైదాన ప్రాంతం! ఒక్క కృష్ణా నదిపై రైల్వే బ్రిడ్జి తప్పితే మిగిలిన పనులు ఒకటి, రెండు సంవత్సరాల్లో పూర్తి చేయవచ్చు. రైల్వే బ్రిడ్జి కూడా ఇప్పుడు మొదలు పెడితే రెండు సంవత్సరాల్లో పూర్తి చేయవచ్చు! భూసేకరణ ఇప్పటికే ప్రారంభం అయింది. నిర్మాణ పనులను విభజించి టెండర్ల ప్రక్రియ పూర్తి చేయడానికి కాలయాపన చేయకుండా పనుల్లో వేగం పెంచితే రెండు సంవత్సరాల్లో పూర్తి చేయవచ్చు. ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం రైల్వే శాఖపై పనుల వేగానికి ఒత్తిడి పెంచాలి.

- గరిమెళ్ల రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.

మీ వ్యాసాలను
పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

నేడు 'అనంత ఉద్యానవన సమ్మేళనం'

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం వేదికగా జాతీయ స్థాయి "అనంత హార్టికల్చర్ కాంక్లేవ్" కార్యక్రమం బుధవారం జరగనుంది. అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్ ఎంవైఆర్ కన్వెన్షనల్ ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది. కార్యక్రమం ఏర్పాట్లు, నిర్వహణపై కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

లైనింగ్ కాదు..వెడల్పు చేయండి..!

- హంద్రీనీవా కాలువ వెడల్పుతోనే ప్రయోజనం
- వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల డిమాండ్



హెచ్ఎల్‌సి అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'జిల్లాకు ప్రాణాధారమైన హంద్రీనీవా కాలువను లైనింగ్ చేయడం వల్ల కాంట్రాక్టర్లకు ఉపయోగం తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదు.. ప్రభుత్వం స్పందించి కాలువను 10 వేల క్యూసెక్కులకు వెడల్పు చేసి, ఆయకట్టుకు నీరు ఇస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.' అని వామపక్షాలు, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు పునరుద్ఘాటించారు. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ వామపక్ష, కాంగ్రెస్ పార్టీలు, ఏపి రైతు సంఘం, జలసాధన సమితి ఆధ్వర్యంలో హంద్రీనీవా ఎస్ఇ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. హెచ్ఎల్‌సి కాలనీ నుంచి ఎస్ఇ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఓ.నల్లప్ప, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, జల సాధన సమితి ఎస్ఎం.బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. రాయలసీమ జిల్లాలకు తాగునీరు, సాగునీరు అందించాలనే ఉద్దేశంతో 1988లో కృష్ణా జలాలను రాయలసీమకు తెచ్చేలా హంద్రీనీవా ప్రారంభించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద రాయలసీమ జిల్లాల్లో 6.2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం ఉందన్నారు. అనంతపురం జిల్లాలో 3.40 లక్షల ఎకరాలకు నీరు అందించాల్సి ఉందన్నారు. 40 టిఎంసిల నీటి కేటాయింపులు ఉన్నా ఇప్పటి వరకు ఆ స్థాయిలో నీరు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఓ.నల్లప్ప, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ చేయడం సరికాదన్నారు. లైనింగ్ చేయడం వల్ల కాంట్రాక్టర్లకు లాభం జరుగుతుంది తప్పా రైతులకు ఎలాంటి లాభం లేదన్నారు. అనంతరం హెచ్ఎల్‌సి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

నాపై కేసులను కొట్టేయండి

కాకాణి

ప్రజాశక్తి-అమరావతి

నెల్లూరు, వేదాయపాలెం, కావలి వన్‌టౌన్ పిఎస్‌లలో నమోదైన కేసులను కొట్టేయాలంటూ వైసిపి నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. తనపై పోలీసులు నమోదు చేసిన కేసుల్లో స్టే ఇవ్వాలని కోరారు. కావలి, బోగోలు మండలం, కోళ్లదిన్నెలో టిడిపి నేతలు, వైసిపి నేతల మధ్య ఘర్షణ జరిగింది. కావలి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించేందుకు కాకాణి వెళ్లిన సందర్భంలో మీడియాతో మాట్లాడుతూ.. టిడిపి నేతలను విడిచిపెట్టేది లేదని చెప్పడంపై కోళ్లదిన్నె టిడిపి నేత వంటేరు ప్రసన్న కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా నమోదైన కేసుల్ని కొట్టేయాలని కాకాణి పిటిషన్ దాఖలు చేశారు.

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు మరో నామినేషన్

- రెండుకు చేరిన నామినేషన్ల సంఖ్య



ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి మంగళవారం మరో నామినేషన్ దాఖలైంది. ఏలూరుకు చెందిన ముళకల శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. ఏలూరు కలెక్టరేట్‌లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి ముళకల శ్రీనివాస్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ వేసిన అభ్యర్థితో రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. సహాయ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఈ నెల మూడో తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఇప్పటి వరకూ దాఖలైన నామినేషన్ల సంఖ్య రెండుకు చేరింది. ఇప్పటి వరకు నామినేషన్ వేసిన వారంతా ఇండిపెండెంట్ అభ్యర్థులే. ఎంఎల్‌సి ఎన్నికల బరిలో ఉన్న పిడిఎఫ్, టిడిపి అభ్యర్థులు ఇంకా నామినేషన్లు వేయలేదు. ఆరు, ఏడు తేదీల్లో ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ నెల పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

పరువునష్టం కేసులో సిఎం అతిశికి నోటీసులు

న్యూఢిల్లీ : బిజెపి నాయకుడు దాఖలు చేసిన పరువునష్టం కేసులో అతిశికి ఆ రాష్ట్ర హైకోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. పరువునష్టం కేసుపై స్పందించాలని అతిశిని జస్టిస్ వికాస్ మహాజన్ ఆదేశించారు. తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేశారు. ఈ ఏడాది జనవరి 27తో పాటు గతేడాది ఏప్రిల్ 2న విలేకరుల సమావేశంలో అతిశి మాట్లాడుతూ ఆప్ ఎమ్మెల్యేలకు బిజెపి రూ. 20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు లంచం ఆశచూపిస్తున్నదని చేసిన విమర్శలపై ఢిల్లీ బిజెపి అధికార ప్రతినిధి ప్రవీణ్ శంకర్ కపూర్ మెజిస్టీరియల్ కోర్టులో కేసు వేశారు. ఈ నోటీసులపై ప్రత్యేక కోర్టును సిఎం ఆశ్రయించగా దంతో వాటిని కొట్టేసింది. దీంతో ఢిల్లీ హైకోర్టును బిజెపి నాయకులు ఆశ్రయించారు.

అయోధ్య 'హత్యాచార' బాధిత కుటుంబానికి

వామపక్షాల పరామర్శ



లక్నో : అయోధ్య జిల్లాలో అత్యాచారానికి, తరువాత హత్యకు గురైన దళిత మహిళ కుటుంబ సభ్యులను వామపక్ష పార్టీల ప్రతినిధి బృందం సోమవారం పరామర్శించింది. కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపం వ్యక్తం చేసింది. న్యాయం కోసం జరుపుతున్న పోరాటానికి పూర్తి మద్దతు ప్రకటించింది. నిందితులను కఠినంగా శిక్షించాలని, నిర్లక్ష్యం వహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి కనీసం రూ. 50 లక్షల ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేసింది. ఈ బృందంలో సిపిఎం జిల్లా మంత్రి అశోక్ యాదవ్, సిపిఐ జిల్లా కార్యదర్శి అశోక్ కుమార్ తివారీ, సిపిఐ జిల్లా ఇన్‌ఛార్జ్ అతీక్ అహ్మద్, కిసాన్ సభ జిల్లా అధ్యక్షుడు రామ్ యాదవ్, సంయుక్త కార్యదర్శి వినోద్ సింగ్ ఉన్నారు. అయోధ్య జిల్లాలోని షహ్నావా గ్రామంలో ఇటీవల ఒక దళిత మహిళపై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేశారు.

రాహుల్‌గాంధీపై ప్రివిలేజ్ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలి

- స్పీకర్‌కు నిశికాంత్ దూబే లేఖ

న్యూఢిల్లీ : కాంగ్రెస్ ఎంపి రాహుల్‌గాంధీపై ప్రివిలేజ్ ప్రొసీడింగ్స్ ప్రారంభించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు బిజెపి ఎంపి నిశికాంత్ దూబే విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పీకర్‌కు ఆయన మంగళవారం లేఖ రాశారు. రాహుల్ గాంధీ సోమవారం ప్రసంగంలో ధ్రువీకరణ లేని, ముఖ్యమైన నిజాలను వక్రీకరించారని దూబే ఆరోపించారు. పార్లమెంటేరియన్లకు ప్రత్యేక హక్కులు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 105ను రాహుల్‌గాంధీ బహిరంగంగా దుర్వినియోగం చేశారని, ఎంపి అధికారాలను ఉపయోగించి అబద్ధాలను వ్యాప్తి చేశారని లేఖలో పేర్కొన్నారు.


118 మందిపై క్రిమినల్ కేసులు

- 24మంది వివరాలను వెల్లడించని పార్టీలు : ఎడిఆర్ నివేదిక

న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో 118 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. వీరిలో 24 మంది (20 శాతం) అభ్యర్థుల క్రిమినల్ రికార్డులను ఆయా పార్టీలు వెల్లడించలేదని, సమర్పించలేదని అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తెలిపింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు 2025పై వివరణాత్మక విశ్లేషణను ఎడిఆర్ విడుదల చేసింది. ఫార్మాట్ సి7 డేటా ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్న వారిని అభ్యర్థులుగా ఎంపిక చేస్తే, అందుకు గల కారణాలను రాజకీయ పార్టీలు వెల్లడించాల్సి ఉంది. కాని, ఆ వివరాలను ఇవ్వడంలో ఆయా పార్టీలు విఫలమయ్యాయని నివేదిక విమర్శించింది. ఢిల్లీ ఎన్నికల్లో 699 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, వీరిలో 118 మంది ఎమ్మెల్యేలు తమపై క్రిమినల్ కేసులను డిక్లరేషన్‌లో ప్రకటించారని, వారి పార్టీలు మాత్రం ఈ విషయాన్ని వెల్లడించలేదని నివేదిక తెలిపింది. 118 మంది అభ్యర్థుల్లో 71 మందిపై అవినీతి, అల్లర్లు, హింసాత్మక నేరాలు వంటి తీవ్రమైన అభియోగాలు ఉన్నాయని తెలిపింది.

వికసిత్ భారత్ లక్ష్యం సాధిస్తాం

- లోక్‌సభలో ప్రధాని మోడీ
- ప్రతిపక్షాలపై ఎదురుదాడి
- సమస్యలపై సమాధానాలు కరువు
- పార్లమెంట్‌లో ఢిల్లీ ఎన్నికల ప్రచారం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ దృఢ సంకల్పాన్ని పునరుద్ఘాటించిందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చల అనంతరం మంగళవారం ప్రధాన మంత్రి సమాధానం ఇచ్చారు. దేశంలోని సమస్యలు, సవాళ్లను ప్రస్తావించకుండా, ప్రతిపక్షాలపై విమర్శలకే ఆయన ప్రసంగం పరిమితమైంది. ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా, ఎదురుదాడికి దిగారు. దీంతో ఆయన ప్రసంగం ఆసాంతం ప్రభుత్వ గొప్పలు చెప్పుకోవడానికి, ప్రతిపక్షాలపై విమర్శలు చేయడానికి ఉపయోగపడింది. రైతుల సమస్యలు, నిరుద్యోగం, ధరలు పెరుగుదల వంటి అంశాలను పూర్తిగా విస్మరించారు. అందుకనే ఆయన ప్రసంగంపై ప్రతిపక్షాలు అసంతృప్తిని వ్యక్తం చేశాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన రాజకీయ ప్రసంగం చేశారు. ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను విమర్శించడంతో ఓట్ల కోసం చేసిన ప్రసంగంలా ఉంది.

నరేంద్రమోడీ మాట్లాడుతూ 'మనం 2025లో ఉన్నాం. ఒక రకంగా 21వ శతాబ్దంలో 25 శాతం ముగిసిపోయింది. 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యం తరువాత, 21వ శతాబ్దంలో 25 ఏళ్లలో ఏం జరిగిందనేది కాలమే చెబుతుంది. రాష్ట్రపతి ప్రసంగాన్ని జాగ్రత్తగా గమనిస్తే, రాబోయే 25 ఏళ్లలో, వికసిత్ భారత్ దిశగా ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పే దిశగా పనిచేయనున్నాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించింది. సరికొత్త ధీమాను కల్పిస్తూ, సామాన్య ప్రజానీకానికి స్ఫూర్తిగా నిలిచింది' అని మోడీ అన్నారు. తమ ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వదని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని అందిస్తుందని ప్రధాని పేర్కొన్నారు. పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని అన్నారు. 25 లక్షల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. పేదలు, సామాన్య ప్రజలు, మధ్యతరగతి సవాళ్లను అవగాహన చేసుకుని, వాటిని అధిగమించేలా చేసేందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు.

ప్రధాని తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా ప్రస్తావిస్తూ.. పేదల గుడిసెల్లో ఫొటో సెషన్లతో సరదాగా గడిపేవారికి పార్లమెంటులో పేదల గురించి మాట్లాడుతూ చేసే ప్రసంగాలు బోర్‌గానే ఉంటాయని అన్నారు. కొందరు నాయకులు విలాసవంతమైన షవర్లు కోరుకుంటారని, తమ ప్రభుత్వం మాత్రం ప్రతి ఇంటికీ నీళ్లు ఇవ్వడంపై దృష్టి సారిస్తుందని కేజ్రీవాల్ విలాసవంతమైన శీష్ మహల్ (అద్దాల మేడ)పై పరోక్ష విమర్శలు గుప్పించారు. ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామాలకు 16 పైసలే చేరుతోందని గతంలో ఒక ప్రధాని వాపోయారని, ఢిల్లీ నుంచి గల్లీ వరకూ అప్పట్లో అదే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోందని, నగదు బదిలీతో నేరుగా ప్రజలకే సొమ్ము అందుతోందని వివరించారు. డిజిటల్ సాంకేతికతను పారదర్శకంగా ఉపయోగించడంతో పది కోట్ల నకిలీ ఖాతాలను తొలగించామన్నారు.

న్యాయవ్యవస్థ నుండి ఎన్నికల సంఘం వరకు
ప్రతిదీ కేంద్రం నియంత్రణలోనే

- దళితులు, మైనార్టీలపై కొనసాగుతున్న దాడులు
- రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శ



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో న్యాయవ్యవస్థ నుండి ఎన్నికల సంఘం వరకు ప్రతిదీ కేంద్ర ప్రభుత్వం నియంత్రణలో ఉందని సిపిఎం రాజ్యసభ ఉపనేత జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. దళితులు, మైనార్టీలపై దాడుల పరంపర కొనసాగుతోందని అన్నారు. మంగళవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో సిపిఎం రాజ్యసభ ఉపనేత జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ దేశంలో దళిత, మైనారిటీ వర్గాలు సంఘ్ పరివార్ పాలనలో భయంతో జీవిస్తున్నాయని అన్నారు. 'ప్రభుత్వం సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ అని చెబుతోంది. ఈ పాలసీ బాధితురాలైన మహిళ జాకియా జాఫ్రీ నిన్న మరణించారు. ఆమె న్యాయం కోసం తిరిగారు. తనవారి కోసం మాత్రమే కాదు, గుజరాత్ మారణహోమంలో ఊచకోత కోయబడిన వారందరికీ న్యాయం కోసం ఆమె తిరిగారు. ఆమె భర్త ఎహ్సాన్ జాఫ్రీ అప్పటి లోక్‌సభ సభ్యుడు. ఆయన్ని కూడా నిర్దాక్షిణ్యంగా చంపేశారు. ఇది మైనారిటీలు ఎదుర్కొంటున్న భయానక వాతావరణం' అని పేర్కొన్నారు.

'ఉత్తరప్రదేశ్‌లో ఏం జరుగుతోంది? వివిధ ప్రాంతాలు తవ్వకాలకు, పరీక్షలకు సిద్ధమవుతోన్నాయి. అజ్మీర్ దర్గా కూడా అదే ముప్పును ఎదుర్కొంటోంది. వాజ్‌పేయి, మోడీ ఇద్దరూ అక్కడ విస్తరించడానికి 'చాదర్‌లను' అందించారు. ఆ దర్గాను కూడా కూల్చివేసేందుకు డిమాండ్ చేస్తున్నారు. ఇదీ మైనారిటీల పరిస్థితి. ప్రతి క్రిస్మస్ నాడు, బిషప్‌లు, పాస్టర్లకు మోడీ విందు ఏర్పాటు చేస్తారు. అది గౌరవం కోసం కాదు. వారి ఓట్లు రావన్న భయంతో మాత్రమే. దేశవ్యాప్తంగా క్రైస్తవులపై 834 దాడులు జరిగాయి. యుపిలోని బరేలీలో ఇంట్లో బైబిల్ ఉంచుకున్నందుకు ఇద్దరికి జైలు శిక్ష విధించారు. దళితులు కూడా వేధింపులకు గురవుతున్నారు. ఢిల్లీలో జరిగిన ఒక వివాహానికి గుర్రంపై వచ్చిన ఒక దళిత వ్యక్తిని ఈడ్చుకెళ్లి కొట్టారు' అని పేర్కొన్నారు.

'కేరళ దేశంలో భాగమని కేంద్ర ప్రభుత్వం భావించడం లేదు. వయనాడ్ విపత్తు సమయంలో కూడా ఎటువంటి సహాయం అందించలేదు. కేరళను వెనుకబడిన రాష్ట్రంగా ప్రకటిస్తే సహాయం అందిస్తామని ఒక కేంద్ర మంత్రి అన్నారు' అని పేర్కొన్నారు. 'శాస్త్రీయ అవగాహన పెంపొందించుకోవాలని రాజ్యాంగం పేర్కొంది. ఇక్కడ ఒక ఐఐటి డైరెక్టర్ గోమూత్రం తాగాలని పిలుపునిస్తున్నారు. న్యాయవ్యవస్థ నుండి ఎన్నికల కమిషన్ వరకు ప్రతిదానినీ ప్రభుత్వం నియంత్రిస్తోంది. ఒక హైకోర్టు న్యాయమూర్తి ముస్లిములను బహిరంగంగా అవమానించారు. ఇది హజ్రత్ మొహాని, భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల భూమి. వారు ప్రజలకు ప్రేరణ. వారు 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదాన్నిచ్చారు. స్వాతంత్ర్యం పోరాటంలోని అలాంటి మంచి విషయాలను తిరిగి పొందాలి' అని బ్రిట్టాస్ తెలిపారు.

స్వీడన్ స్కూల్లో కాల్పులు

- నిందితుడుసహా 10 మంది మృతి

స్టాక్‌హోమ్ : సెంట్రల్ స్వీడన్‌లోని ఒరెబ్రో నగరంలో ఒక స్కూల్లో మంగళవారం జరిగిన ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో నిందితుడితోసహా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. అనుమానితుడిని ఇంకా గుర్తించలేదు. స్కూల్లో కాల్పుల ఘటన గురించి మధ్యాహ్నం 12:33 గంటల సమయంలో పోలీసులకు సమాచారం వచ్చింది. అధికారులు ఆ ప్రాంతంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. ఎంతమంది గాయపడ్డారో కచ్చితంగా తెలియడం లేదని, పెద్ద ఎత్తున ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ప్రస్తుతానికి వున్న సమాచారం ప్రకారం 10 మంది మరణించారని చెప్పారు. 'హత్యకు ప్రయత్నించడం, లూటీలు, అల్లర్లు, గృహ దహనాలు, ఆయుధ నేరాల' కింద ఈ నేరాన్ని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. స్కూల్ ఒక హాల్ నుంచి కాల్పుల శబ్దాలు వినిపించాయని, ఆటోమేటిక్ తుపాకీ కాల్పులుగా భావిస్తున్నామని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై స్వీడన్ ప్రధానమంత్రి తీవ్రంగా స్పందించారు. 'దేశం మొత్తానికి బాధాకరమైన రోజు'

మున్సిపల్ శాఖ పరిధిలోకి 176మంది పంచాయతీ ఉద్యోగులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నగర పంచాయతీలుగా అప్ గ్రేడ్ చేసిన గ్రామ పంచాయతీల్లో ఉద్యోగులను మున్సిపల్ శాఖ పరిధిలోకి తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 12 నగర పంచాయతీల్లో పని చేస్తున్న వివిధ కేడర్‌లలోని 176 మంది గ్రామ పంచాయతీ ఉద్యోగులను పురపాలక శాఖ పరిధిలోకి తెచ్చేందుకు ఆ శాఖ కమిషనర్ అందించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం అందుకు అనుమతి ఇచ్చింది. దీంతో కొండపల్లి, కుప్పం మున్సిపాలిటీలు, దాచేపల్లి, గురజాల, పెనుగొండ, బేతంచర్ల, బుచ్చిరెడ్డిపాళెం, బి.కొత్తకోట, చింతలపూడి, పొదిలి, దర్శి, ఆకివీడు నగర పంచాయతీల్లో ఉద్యోగులను ఆయా మున్సిపల్ శాఖలోని తత్సామాన పోస్టుల్లోకి తీసుకున్నారు.

విద్యకు ఎఐ సెంటర్ మా రాష్ట్రానికివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో తాము ఏర్పాటు చేయాలనుకుంటున్న డేటా సిటీకి సహకరించాలని కోరారు.

ఎఐతో వస్తున్న అవకాశాలు అందిపుచ్చుకుంటూ డేటా సిటీల ఏర్పాటుకు అవసరమైన ప్రత్యేక పాలసీల రూపకల్పన, సింగిల్ విండో పద్ధతిలో కేంద్రం నుండి అనుమతులు సులభతరం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్స్ కంపెనీల ఏర్పాటుకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలో ఎన్నో ఏళ్లుగా 800 నిరుపేద కుటుంబాలు నిరుపయోగంగా ఉన్న రైల్వే భూముల్లో నివసిస్తున్నారని, మానవతా దృక్పథంతో ఆ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి కేటాయించాలని కోరారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలకు శాశ్వత ఇళ్ల పట్టాలు అందజేస్తామని తెలిపారు.

సమిష్టి కృషితోనే రాష్ట్రానికి మేలు

కలిసికట్టుగా ఉండటం వల్లే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోగలిగామని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇకముందు కూడా ఇదే పంథా కొనసాగిస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మంగళవారం నాడిక్కడ ఆయన కేంద్ర మంత్రులు శ్రీనివాస వర్మ, రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టిడిపి ఎంపిలు, బిజెపి నేతలు మంత్రి లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే సమిష్టి కృషితో విశాఖ రైల్వే జోన్, అమరావతి, పోలవరం, స్టీల్‌ప్లాంట్‌కు నిధులు తెచ్చుకోగలిగామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర మంత్రులు, ఎంపిలు చేస్తున్న కృషిని లోకేష్ అభినందించారు.

ఏడాదిలో 17,654 కంపెనీలు మూత

రాజ్యసభలో కేంద్ర మంత్రి హర్ష్ మల్హోత్రా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17,654 కంపెనీలు మూతపడ్డాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాజ్యసభలో మంగళవారం వైసిపి ఎంపి పరిమల్ నత్వానీ అడిగిన ప్రశ్నకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జనవరి 26 వరకు 17,654 కంపెనీలు మూసివేయబడ్డాయని తెలిపారు. 2023-24లో 22,044, 2022-23లో 84,801 కంపెనీలను మూసివేశారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ అమలు చేసే కంపెనీల చట్టం కింద దేశంలో కంపెనీలు రిజిస్ట్రేషన్ జరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి 26 వరకు 1,38,027 కంపెనీలు నమోదు చేయగా, అయితే ఈ సంఖ్య 2023-24లో 1,85,318, 2022-23లో 1,59,302లో కంటే తక్కువగా ఉంది.

ప్రతి పంటకూ, ప్రతి ఎకరాకూ బీమా వర్తింపజేయాలి
లోక్‌సభలో ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రతి పంటకూ, ప్రతి ఎకరాకూ బీమా వర్తింపజేయాలని టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్ చేశారు. మంగళవారం లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో రైతుల పంట బీమాను త్వరితగతిన అందజేయడానికి బీమా కంపెనీల సంఖ్యను పెంచాలని, బీమా పరిధిలోకి మరిన్ని పంటలను చేర్చాలని ఆయన కోరారు. 'ప్రపంచానికే భారతదేశం ఆహార భాండాగారం కావాలని బడ్జెట్‌లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. రైతులు పండిస్తున్న సుమారు 200 పంటలకు గానూ, 60 పంటలకే బీమాను వర్తింపజేస్తున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా పబ్లిక్ రంగంలో 5, ప్రైవేట్ రంగంలో 15 మాత్రమే ఉన్నాయి. బీమా కంపెనీల సంఖ్యను పెంచడమే కాకుండా అత్యధిక పంటలకు బీమాను వర్తింపజేయాలి' అని కోరారు. అందుకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ సమాధానమిస్తూ.. 'ఫసల్ బీమా యోజనలో టెక్నాలజీ ఉపయోగిస్తున్నాం. రిమోట్ సెన్సింగ్ డేటాతో పంట నష్టాన్ని అంచనా వేస్తున్నాం. తద్వారా బీమా కంపెనీలు బీమా చెల్లింపులు చేయడం సులభతరం చేశాం. మరిన్ని పంటలను ఫసల్ బీమా పరిధిలోకి తెస్తున్నాం. బీమా కంపెనీలు కూడా 20కు చేరాయి. ఇంకా పెరుగుతాయి. ఫసల్ బీమా యోజనను మరింత మెరుగుపరిచే విషయంలో కేంద్రం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది' అని అన్నారు.

తీవ్ర ఇబ్బందుల్లో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ :
లోక్‌సభలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటోందని కేంద్ర ఉక్కుశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తెలిపారు. లోక్‌సభలో జనసేన ఎంపి వల్లభనేని బాలశౌరి, బిజెపి ఎంపి సిఎం రమేష్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. '2024-25 (ఏప్రిల్-డిసెంబర్ 2024)లో రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) 2.68 మిలియన్ టన్నుల హాట్ మెటల్, 2.37 మిలియన్ టన్నుల సేలబుల్ స్టీల్‌ను ఉత్పత్తి చేసింది. 2024 ఏప్రిల్-డిసెంబర్‌లో ఆర్ఐఎన్ఎల్ మొత్తం ఆదాయం రూ.12,615.03 కోట్లు వచ్చిందని, ఈ కాలంలో రూ.3,943.43 కోట్ల నష్టాన్ని చవిచూసింది' అని తెలిపారు. 2024 డిసెంబర్ 31 నాటికి ఆర్ఐఎన్ఎల్ మొత్తం అప్పులు దాదాపు రూ.38,965.00 కోట్లు అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు రూ.10,300 కోట్ల ఈక్విటీ మూలధనాన్ని (2024 సెప్టెంబర్‌లో ఇప్పటికే అత్యవసర నిధులుగా అందించిన రూ.500.00 కోట్లతో సహా), రూ.1,140 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ లోన్‌ను 7 శాతం నాన్‌క్యుములేటివ్ ప్రిఫరెన్స్ షేర్ మూలధనంగా మార్చడానికి ఆమోదం తెలిపిందని చెప్పారు. ఆర్ఐఎన్ఎల్ 2024 సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో ఉద్యోగులకు పాక్షిక జీతాలను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఈ ఆందోళనలు తొలగించేందుకు కేంద్రప్రభుత్వ ప్యాకేజీ ఉపయోగపడుతుందని అన్నారు.



16 మంది కార్మికులకు విముక్తి

- లిబియా నుండి బయటపడిన బాధితులు

ట్రిపోలి : లిబియా సిమెంట్ ఫ్యాక్టరీలో చిక్కుకుపోయిన 16మంది కార్మికులు మంగళవారం భారతదేశానికి బయలుదేరారు. వీరంతా బుధవారం తెల్లవారు జామునకు ఢిల్లీకి చేరుకుంటారని భావిస్తున్నారు. పది నెలలుగా లిబియాలో చిక్కుకుపోయిన వీరు బెంఘాజీ నుండి న్యూఢిల్లీకి టర్కీ ఎయిర్‌లైన్స్ విమానంలో వస్తున్నారు. లిబియా సిమెంట్ కంపెనీకి చెందిన బెంఘాజీ ప్లాంట్‌లో 16మంది భారతీయ కార్మికులు నిర్బంధించబడిన సంగతి తెలిసిందే. ఆ ప్లాంట్‌లో జైలు తరహా పరిస్థితులున్నాయని, అధిక పనిగంటలు, అస్థిరమైన వేతనాలతో అక్కడ పనిచేయలేకపోతున్నామని వారు వాపోయారు. వీరంతా ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన వారు. బెంఘాజీలోని ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపల్ తబస్సుమ్ మన్సూర్ వీరి వెతలను బయటి ప్రపంచానికి తెలియజేయడంలో సాయపడ్డారు. గత ఏడాది సెప్టెంబర్ నుండి కాంట్రాక్టర్ వేతనాల్లో కోతలు పెడుతూ వచ్చారని, అప్పటి నుండే తమకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయని తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన మిథిలేష్ విశ్వకర్మ చెప్పారు. తొలుత ఎనిమిదిన్నర పనిగంటలు వుండేవని, నాలుగు నెలల క్రితానికి రెట్టింపు పని గంటలయ్యాయని చెప్పారు. పని గంటలను తగ్గించాలని, వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సెప్టెంబర్‌లో నిరసన చేపట్టామని, అదే సమయంలో కాంట్రాక్టర్ దుబాయ్ నుండి పారిపోయారని వారు చెప్పారు. కార్మికులపై వారు చేయి కూడా చేసుకున్నారని విశ్వకర్మ తెలిపారు.

బొగ్గు, చమురు వాహనాలు సహా పలు ఉత్పత్తులపై
10శాతం సుంకాలు

- అమెరికాకు దీటుగా సమాధానమిచ్చిన చైనా
- డబ్ల్యుటిఓలో ఫిర్యాదు నమోదు

బీజింగ్ : అమెరికా విధించిన టారిఫ్‌లపై చైనా ప్రభుత్వం దీటుగా స్పందించింది. అమెరికా నుండి దిగుమతయ్యే బొగ్గు, ఎల్ఎన్‌జి ఉత్పత్తులపై 15శాతం, ముడి చమురు, ఇతర ఉత్పత్తులపై పది శాతం అదనపు సుంకాలను విధిస్తున్నట్లు చైనా ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 10 నుండి ఈ టారిఫ్‌లు అమల్లోకి రానున్నాయి. అంతర్జాతీయ చట్టం మౌలిక సూత్రాలు, టారిఫ్ లా వంటి చైనా చట్టాలు, ఇతర నిబంధనలకు అనుగుణంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు కస్టమ్స్ టారిఫ్ కమిషన్ మంగళవారం ప్రకటించింది. కెనడా, మెక్సికో, చైనా దేశాల ఉత్పత్తులపై ఈ నెల 1న అదనపు దిగుమతి సుంకాలను విధిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. వ్యవసాయ పనిముట్లు, ఆటోమొబైల్స్ పికప్ ట్రక్కులు వంటి వాటిపై కూడా 10శాతం అదనపు టారిఫ్‌లు అమలు కానున్నాయని కమిషన్ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఏ ఏ ఉత్పత్తులకు ఎంతెంత అదనపు సుంకాలనేవి అనుబంధ పత్రాల్లో వెల్లడించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ప్రస్తుత బాండెడ్ విధానాలు, పన్ను తగ్గింపు, మినహాయింపు విధానాలేవీ మారబోవని, తాజా టారిఫ్‌లకు ఎలాంటి మినహాయింపులు,, తగ్గింపు వుండబోదని కమిషన్ ప్రకటన పేర్కొంది.

చైనా నుండి దిగుమతయ్యే ఉత్పత్తులపై అదనంగా 10శాతం సుంకాలు విధిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) వివాదాల పరిష్కార యంత్రాంగంలో చైనా ఫిర్యాదు నమోదు చేసింది. ఈ మేరకు చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. చైనా చట్టబద్ధమైన హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించుకోవడం కోసమే ఈ చర్య తీసుకున్నట్లు వాణిజ్య శాఖ ప్రతినిధి మీడియాకు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకపక్షంగా అధిక టారిఫ్‌లను విధించడం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ) నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని విమర్శించింది. ఈ చర్య అమెరికా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోగా చైనా, అమెరికాల మధ్య నెలకొన్న ఆర్థిక, వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తుందని తెలిపింది. చైనా దిగుమతులపై ట్రంప్ విధించిన 10శాతం సుంకాలు మంగళవారం నుండి అమల్లోకి వచ్చాయి.

బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు గట్టి మద్దతుదారుగా డబ్ల్యుటిఓ సభ్య దేశాలతో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా వుంటుందని వాణిజ్య ప్రతినిధి చెప్పారు. ఏకపక్షవాదం, వాణిజ్య రక్షణవాదం వంటి చర్యల వల్ల బహుళపక్ష వాణిజ్య వ్యవస్థకు ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అంతర్జాతీయ వాణిజ్యాభివృద్ధిని పరిరక్షించేందుకు కట్టుబడి వుంటామని తెలిపారు.

నేడు ఢిల్లీ ఎన్నికలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- బిజెపిపై ఇసికి కేజ్రీవాల్ బృందం ఫిర్యాదు
- అతిషిపై కేసు నమోదు



న్యూఢిల్లీ : ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు చివరి దశకు చేరుకున్నాయి. బుధవారం 70 అసెంబ్లీ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా పటిష్టంగా భద్రతా ఏర్పాటు చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో పాటు మిల్కిపూర్ (ఉత్తరప్రదేశ్), ఈరోడ్ (తూర్పు) (తమిళనాడు) అసెంబ్లీ స్థానాలకు కూడా బుధవారం ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ నెల 8న వీటి ఫలితాలు వెల్లడించనున్నారు.

ఓటర్లపై దాడి చేసి, వేళ్లపై సిరా పోస్తున్నారు :
బిజెపిపై ఇసికి కేజ్రీవాల్ ఫిర్యాదు

ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఓటర్లపై బిజెపి గూండాలు దాడులకు, బెదిరింపులకు దిగుతున్నారని కేజ్రీవాల్ విమర్శించారు. బిజెపిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్ అధికారులను కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆప్ బృందం విజ్ఞప్తి చేసింది. ఇసి అధికారులతో సమావేశం తరువాత మీడియా ప్రతినిధులతో కేజ్రీవాల్ మాట్లాడారు. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో సోమవారం రాత్రి బిజెపి గూండాలు దాడికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రజలపై దాడి చేసి, బలవంతంగా వేళ్లపై సిరా వేస్తున్నారని, బుధవారం ఓటింగ్‌కు రావొద్దని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విషయాలన్నీ ఇసి దగ్గర లేవనెత్తినట్లు తెలిపారు. కఠినమైన చర్యలు తీసుకుంటామని, నిష్పాక్షికంగా ఎన్నికలు జరుగుతాయని ఇసి హామీ ఇచ్చినట్లు కేజ్రీవాల్ తెలిపారు.

నిష్పాక్షికంగా పనిచేస్తాం : ఇసి

ఆప్ బృందంతో భేటీ తరువాత ఇసి ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల అధికారులందరూ నిష్పాక్షికంగా పని చేస్తారని, అందరికీ సమాన అవకాశాలను దెబ్బతీసే ఏ పక్షపాత ప్రవర్తనను క్షమించబోమని ఇసి ఎక్స్‌లో పోస్టు చేసింది. ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అనుసరించాలని, రాత్రంతా సరిహద్దు ప్రాంతాల్లో కఠినమైన నిఘా ఉంచాలనిపోలీసు, ఎన్నికల పరిశీలనా అధికారులను ఆదేశించింది. ప్రలోభాలు, బెదిరింపు ఘటనలకు వ్యతిరేకంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.

ఓడిపోతామనే ఆప్ ఫిర్యాదులు

బిజెపి ఎంపి హర్ష మల్హోత్రా స్పందిస్తూ... ఆప్ ఆరోపణలన్నీ నిరాధారమని తెలిపారు. 'ఆప్ నాయకులు మేం (బిజెపి) ఇవిఎంలను ట్యాంపరింగ్ చేశామని నిందించడం కూడా ఆరంభిస్తారు. ఓటమి భయంతోనే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారు.' అని అన్నారు.

అతిషిపై ఢిల్లీ పోలీసుల కేసు

ఢిల్లీ ముఖ్యమంత్రి, కల్కాజీ నియోజకవర్గ ఆప్ అభ్యర్థి అతిషిపై ఢిల్లీ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి)ను ఉల్లంఘించారని, విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను అడ్డుకున్నారనే అభియోగాలతో ఎఫ్ఐఆర్ నమోదైనట్లు పోలీసు అధికారులు తెలిపారు.

వైస్రాయ్‌ల మాదిరిగా గవర్నర్లు

- వారితో రాష్ట్ర యూనివర్శిటీలపై కేంద్రం పెత్తనం
- యుజిసి సవరణలు సమాఖ్య సూత్రాలకు విరుద్ధం
- రాజ్యసభలో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్
- యుజిసి సవరణ ప్రతిపాదనలను సమీక్షిస్తాం : మంత్రి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైస్రాయ్‌ల మాదిరిగా వ్యవహరించే గవర్నర్లతో రాష్ట్ర యూనివర్శిటీలపై కేంద్రప్రభుత్వం పెత్తనం చెలాయించాలనుకుంటోందని సిపిఎం రాజ్యసభ ఉప నాయకుడు జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. యుజిసి సవరణలు సమాఖ్య సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని, ఈ సవరణలు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. యుజిసి సవరణ ప్రతిపాదనలను సమీక్షిస్తామని కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజ్యసభకు హామీ ఇచ్చారు. జెడియుతో సహా ఎన్‌డిఎ మిత్రపక్షాలు కూడా యుజిసి సవరణ చర్యను వ్యతిరేకించాయి. కేరళ, తమిళనాడు అసెంబ్లీలు యుజిసి సవరణ చర్యకు వ్యతిరేకంగా తీర్మానాలను ఆమోదించాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా జాన్ బ్రిట్టాస్ మాట్లాడుతూ ఆయా రాష్ట్రాల కృషితో రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. "కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విశ్వవిద్యాలయాలను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తోంది. కొత్త సవరణ ప్రకారం గవర్నర్లు వైస్ ఛాన్సలర్లను నియమిస్తారు. అటువంటి సవరణ సమాఖ్య సూత్రాలకు విరుద్ధం. ఇది రాష్ట్రాల అధికారాలపై అతిక్రమణ. ఇది ఆమోదయోగ్యం కాదు" అని బ్రిట్టాస్ అన్నారు. కేంద్ర మంత్రి స్పందిస్తూ... ప్రస్తుత యుజిసి నిబంధనలు ముసాయిదా నిబంధనలేనని, తుదివి కావని తెలియజేశారు. కొన్ని రాష్ట్రాలు, చాలామంది తమ అభిప్రాయాలను తెలిపారని, ముసాయిదా చట్టాన్ని ఖరారు చేసేటప్పుడు వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుంటామని మంత్రి తెలిపారు.

చర్లపల్లి భారీ అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని చర్లపల్లి పారిశ్రామిక వాడలోని సర్వోదయ సాల్వెంట్ ప్రయివేట్ లిమిటెడ్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మంటలు చుట్టుపక్కల పరిశ్రమలకు వ్యాపించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్ని కీలలకు పక్కనే ఉన్న మహాలక్ష్మి రబ్బర్ కంపెనీ, శేషసాయి రసాయన పరిశ్రమలకు మంటలు వ్యాపించాయి. భారీగా ఎగసిపడిన మంటల ధాటికి సర్వోదయ సాల్వెంట్ పరిశ్రమ భవనం కుప్పకూలింది. ప్రమాదం జరిగిన సమయంలో పరిశ్రమలో 20వేల లీటర్ల రసాయనాలు ఉన్నట్టు సమాచారం. అగ్నిప్రమాదం సమయంలో సర్వోదయ కంపెనీలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. సుమారు పది ఫైరింజన్లు మంటలను అదుపు చేస్తున్నాయి.

కేంద్ర బడ్జెట్‌కు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య, సామాజిక ప్రయోజనాల హక్కులకు హామీ ఇస్తాయని తెలిపారు. వీటిని బడ్జెట్‌లో ప్రవేశపెట్టి, ఫైనాన్స్ బిల్లులో స్థానం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇవి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ...

- దేశంలో 200 మంది శత కోటీశ్వరుల(డాలర్లలో)పై 4శాతం సంపద పన్ను ప్రవేశపెట్టాలి, కార్పొరేట్ పన్నును పెంచాలి.
- వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలి. వ్యవసాయ మార్కెటింగ్‌పై జాతీయ విధాన ముసాయిదాను ఉపసంహరించాలి.
- నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ ద్వారా చేపట్టే ప్రభుత్వరంగ ప్రైవేటీకరణ చర్యలను, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు రంగానికి బదలాయించడాన్ని ఆపాలి. బీమా రంగంలో వంద శాతం ఎఫ్‌డిఐలను ఉపసంహరించాలి.
- మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులను 50శాతం పెంచాలి. పట్టణ ఉపాధి హామీ చట్టాన్ని కూడా ప్రవేశపెట్టాలి. వృద్ధాప్య పెన్షన్లు, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాల కోసం కేంద్ర కేటాయింపులు పెంచాలి.
- ఆరోగ్య రంగ కేటాయింపులను జిడిపిలో 3శాతానికి పెంచాలి. విద్యా రంగానికి జిడిపిలో ఆరు శాతానికి కేటాయింపులు పెంచాలి.
- ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఆహార సబ్సిడీని పెంచాలి.
- ఎస్‌సి, ఎస్‌టి రంగాలకు, మహిళా, శిశు సంక్షేమానికి కేటాయింపులను గణనీయంగా పెంచాలి. వీటిల్లో ఐసిడిఎస్‌కు కూడా కేటాయింపులు పెరగాలి. అలాగే స్కీమ్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాల్లో కేంద్రం వాటాను పెంచాలి.
- రాష్ట్రాలకు నిధుల బదిలీని పెంచాలి. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాలకు కూడా నిధులను గణనీయంగా పెంచాలి. రాష్ట్రాలతో పంచుకునే విభాగంలో చేర్చని పెట్రోలియం ఉత్పత్తులపై సెస్సులను, సర్‌చార్జిలను రద్దు చేయాలి.

అంపశయ్యపై ప్రభుత్వ విద్య

(మొదటి పేజీ తరువాయి)

నియామక అధికారం గవర్నర్లకు కేంద్ర ప్రభుత్వం అప్పగించడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక పథకం ప్రకారం రాష్ట్రాల అధికారాలన్నింటిని లాక్కుంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న కేంద్రీకరణ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం తన హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యావ్యవస్థకు ప్రాణప్రతిష్ట చేసేందుకు ముందుకు రావాలని, విద్యావ్యవస్థపై అకడమిక్ ఫ్రీడం ఉండాలన్నారు. విద్యార్థి దశ నుంచి ఎన్నికలు నిర్వహించడం ద్వారా యువతకు నాయకత్వ లక్షణాలు అలవడతాయని, అటువంటి వారికి ఎన్నో విలువలుంటాయన్నారు. కాంట్రాక్టర్లు, రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులు, మైనింగ్ వ్యాపారస్తులు, సమాజం పట్ల అవగాహన లేనివారు రాజకీయల్లోకి వస్తే పాలన సజావుగా సాగదన్నారు. సిపిఎం రాష్ట్ర 27వ మహాసభను విజయవంతం చేసిన వామపక్ష అభిమానులకు, నెల్లూరు జిల్లా ప్రజలకు అభినందనలు తెలియజేశారు. నగరంలో నిర్వహించిన సిపిఎం రాష్ట్ర మహాసభ కమ్యూనిస్టు ఉద్యమ పునర్జీవానికి తోడ్పడుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఎం.మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, కె.అజయ్‌కుమార్, మూలి వెంగయ్య, రెహానాబేగం తదితరులు పాల్గొన్నారు.





మీ కోసం

పొడిబారిన పెదవులపై కొబ్బరినూనె, బాదం నూనెను సమపాళ్లలో కలిపి రాసుకుంటే మృదువుగా ఉంటాయి.

జీవన సారథం

ఎప్పటికీ మన స్థాయిని పెంచేది మన ప్రవర్తన తప్ప ఎదుటి వారి పొగడ్త కాదు.

అమ్మ మాట



చిలకల రాజ్యంలో హరితం అనే పిల్ల చిలుక తల్లితో కలిసి ఉండేది. హరితం చిన్నది కాబట్టి ఎక్కడికీ ఒంటరిగా వెళ్లొద్దని తల్లి చిలుక చెప్పేది. హరితానికి మాత్రం ఆకాశంలో ఎగురుతూ, ప్రపంచాన్ని చూడాలని కోరిక ఉండేది.

ఒకసారి తల్లి ఆహారం కోసం వెళ్లినప్పుడు హరితానికి ఆకాశంలో ఎగిరి రావాలన్న బుద్ధి పుట్టింది. అనుకున్న వెంటనే చెట్టు మీద నుంచి ఎగురుతూ వెళ్లింది. వాళ్లుండే అడవి దాటగానే పెద్ద పర్వతం కనబడితే అక్కడకు వెళ్లింది. దగ్గరలో కనబడిన పెద్ద నది మీదుగా ఎగిరింది. ఎగురుకుంటూ ప్రకృతిని చూస్తుంటే దానికెంతో సంతోషం కలిగింది. అలా చాలా సేపు ఎక్కడెక్కడో ఎగిరింది హరితం. ఇన్నాళ్లూ గొప్ప అందాలను చూడకుండా ఆపేసిన తల్లి మీద హరితానికి కోపం వచ్చింది కూడా.

అలా చాలా సేపు ఎగిరిన హరితానికి క్రమంగా రెక్కల్లో సత్తువ తగ్గి, నొప్పి మొదలైంది. రెక్కలు కదపలేకపోవడంతో గాలి వాటున కిందకు పడిపోసాగింది. అలా జారిపోతూ చుట్టూ చూస్తుంటే మేఘాలు తప్ప దారి కనబడలేదు. దానికి భయం వేసింది.

'ఒక్కత్తనే వెళ్లొద్దని అమ్మ చెప్పినా వినకుండా వచ్చి ప్రమాదంలో పడ్డాను. తిరిగి ఇంటికి వెళ్లగలనో లేదో' అనుకుంది. దానికి ఏడుపు వచ్చింది. అంతలో మరో పెద్ద పక్షి ఎదురుగా వస్తూ హరితాన్ని చూసింది. పడిపోతున్న హరితాన్ని పట్టుకుని తన మీద కూర్చోబెట్టుకుని 'మీ అమ్మ నాకు తెలుసు. అమ్మ దగ్గరకు తీసుకెళ్తాను. భయపడకుండా నా మీద కూర్చో. చిన్నపిల్లవే కదా. ఒక్కత్తివే ఎక్కడి కెళ్ళావు?' అని అడిగిందా పక్షి.

జరిగిందంతా చెప్పింది హరితం. 'అమ్మకి చెప్పకుండా బయటికి వెళ్ళకూడదు. నేను కాబట్టి సరిపోయింది. మరేదైనా పక్షికో, జంతువుకో దొరికితే నిన్ను కొరుక్కు తినేసేవి. ఇంకెప్పుడూ అమ్మకి తెలియకుండా ఎక్కడికీ వెళ్లకు' అంది. హరితాన్ని క్షేమంగా తల్లి దగ్గరకు చేర్చి వెళ్లిపోయిందా పక్షి.

అమ్మని చూడగానే హరితానికి ఏడుపొచ్చింది. తల్లి చిలుక కూడా పిల్లకేమైందో అని బెంగపడుతూనే ఉంది. అది కూడా పిల్ల చిలుకని చూసి ఏడ్చి రెక్కల్లో పొదువుకుంది. అమ్మ స్పర్శ తగలగానే హరితానికి భయం పోయి హాయిగా అనిపించింది.

పెద్దల మాట వినకపోతే ప్రమాదంలో పడతామని పిల్ల చిలుకకి అప్పుడు తెలిసొచ్చింది. అప్పటి నుంచి అమ్మ చెప్పినట్టే చేసేది హరితం.

- నారంశెట్టి ఉమామహేశ్వరరావు,
94907 99203.

నేను గీసిన బొమ్మ




నేను గీసిన బొమ్మ



- సి.ప్రణయ్ కుమార్,
7వ తరగతి,
విఎస్ఎన్ సిద్ధార్థ,
పీలేరు,
అన్నమయ్య జిల్లా.

తేడాలు గుర్తించండి

పిల్లలూ, ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో 15 తేడాలు ఉన్నాయి. గుర్తించండి చూద్దాం.



మతాలకతీతంగా మానవతా ప్రభాతం!

కుంభమేళాలో తొక్కిసలాట జరిగినప్పుడు ... ఆ విషాద ఘటనలో ప్రాణాలొదిలిన వాళ్లు కొంతమందైతే, అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని పరుగులు తీసినవారు మరికొంతమంది. అలా పరుగులు పెడుతున్న ఓ హిందువు అకస్మాత్తుగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. చుట్టూ జనం. పడిపోయిన వ్యక్తిని నిలబెట్టే సాహసం కూడా ఎవరూ చేయడం లేదు. అప్పుడే అక్కడికి ఓ ముస్లిం వ్యక్తి వచ్చాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతనికి ఊపిరి ఊది ప్రాణాలు రక్షించాడు. ఈ మొత్తం ఉదంతాన్ని వీడియో తీసిన ఓ వ్యక్తి ఇటీవల ఈ దృశ్యాలని సోషల్ మీడియాలో షేర్‌చేశాడు. ఇదొక్కటే కాదు, ఇంకా అక్కడ ముస్లిం వ్యక్తులు హిందూ భక్తుల కోసం చేస్తున్న సేవలు అనేకం ఉన్నాయి. ఇది కదా భారతదేశం. మత సామరస్యానికి చిహ్నంగా మహా కుంభమేళాలో జరిగిన ఆ విశేషాలు చూద్దాం.


'ఆ ప్రాంతంలో షాపులు పెట్టుకునేందుకు వాళ్లకి అనుమతులు ఇస్తే, ఆ ప్రదేశం పవిత్రత కోల్పోతుంది. వాళ్లు అక్కడ కావాలని కొన్ని అభ్యంతరకర చేష్టలు చేస్తారు. అవి అక్కడికి వచ్చే ఎంతో పవిత్రులైన నాగసాధువులకు కోపం తెప్పిస్తాయి. ఆ తరువాత జరిగే పరిణామాలకు ప్రపంచంలో దేశ పరువు మంటగలిసిపోతుంది' అని కుంభమేళా ప్రారంభానికి కొన్ని రోజుల ముందు అఖిల భారతీయ అఖాడా పరిషద్ ప్రతినిధి మహంత్ రవీంద్ర పూరీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇంకా 'వాళ్లు మా మతాన్ని అపవిత్రం చేస్తారు. కూరగాయల షాపులు, జ్యూస్ షాపులు, ఫుడ్ స్టాల్స్, టీ షాపులకు వాళ్లకి అనుమతి ఇస్తే, మేము తినే ఆహారాన్ని కావాలనే అపవిత్రం చేస్తారు. దాని మీద ఉమ్మి వేసి ఇచ్చినా ఇస్తారు' అని కూడా మాట్లాడారు. కానీ, ఇంత ప్రతికూల వాతావరణంలోనే మతానికి మించిన మానవత్వ హృదయాలు అక్కడ కనిపించాయి.

ఘటన జరిగిన తర్వాత, పరిస్థితి తీవ్రత అర్థమైన స్థానిక ముస్లిం వ్యక్తులు, కుంభమేళాకి వచ్చే భక్తుల కోసం సంఘటితమయ్యారు. విశేషంగా సేవచేస్తున్నారు. సిక్కులు, ముస్లింలు ఆహారం, వసతి, నీళ్ల వంటి సౌకర్యాలను అందిస్తున్నారు. 25 వేలకి పైగా దుప్పట్లు పంపిణీ చేశారు. దర్గాలు, మసీదుల్లో భక్తుల కోసం బస ఏర్పాటు చేస్తున్నారు. వాళ్లంతా సురక్షితంగా ఉండాలని ప్రార్థనలు చేస్తున్నారు. ఇది కదా గంగా-జమున స్ఫూర్తి. ఇది కదా మతం హద్దులను చెరిపేసిన మానవత్వం.



మతం సరిహద్దులను చెరిపేసిన మానవత్వ దృశ్యాలు అక్కడ కనిపిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభమేళాలో మౌని అమావాస్య రోజున, ఆ తరువాత వరుసగా జరిగిన ఉదంతాల నేపథ్యంలో హిందూభక్తుల కోసం ముస్లిం, సిక్కు మతాల ప్రజలు మానవతా దృక్పథంతో స్పందించారు. మతాలు వేరైనా మనుషులు ఒక్కటే అని చాటిచెప్పారు. కలసి మెలసి బతికే భారతీయుల అసలు స్వభావాన్ని వెల్లడి చేశారు.

ఘటన రోజు ముస్లిం వాలంటీర్ ఫర్హాన్ అలాం, తనకెదురైన అనుభవాన్ని ఇలా చెబుతున్నారు : 'ఆ రోజు రామ్ శంకర్ అనే భక్తుడు గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. అక్కడే నేను ఉన్నాను. అతను పూర్తిగా స్పృహ కోల్పోయాడు. పరిస్థితి నాకు అర్థమైంది. ఆలస్యం చేయకుండా అతనికి సిపిఆర్ చేశాను. అతడు లేచి నిలబడ్డాడు' అని చెబుతున్న ఫర్హాన్ ఆ సమయంలో ఎంత టెన్షన్ పడ్డాడో వైరల్ అయిన వీడియోలో చాలా స్పష్టంగా కనిపిస్తోంది. చూసేవాళ్లకి ఓ హిందువుని ఓ ముస్లిం వ్యక్తి కాపాడుతున్నట్లు కనిపించదు.. ప్రాణాపాయంలో ఉన్న ఒక వ్యక్తిని కాపాడుకోవడానికి మానవత్వమున్న మరో వ్యక్తి ఎంతలా తపన పడతాడో కనిపిస్తుంది.



అందుకే ఫర్హాన్ తెగువకి, అతను చూపిన మానవత్వ హృదయానికి సోషల్ మీడియాలో ప్రశంసలు జల్లు కురిసింది.

ఈ ఘటన తరువాత ప్రయాగరాజ్‌లోని స్థానిక ముస్లిం సమాజం అద్భుతమైన కరుణ, ఐక్యతను ప్రదర్శించింది. తొక్కిసలాట దుర్ఘటన తరువాత జనవరి 29న భక్తుల ప్రవేశానికి ప్రభుత్వం తీవ్ర ఆంక్షలు పెట్టింది. దీంతో, వేలాది మంది భక్తులు ఎక్కడివారక్కడే చిక్కుకుపోయారు. జాన్‌సెన్‌గంజ్ రోడ్డుతో సహా 10కి పైగా ప్రాంతాలన్నీ కిటకిటలాడిపోయాయి. పరిస్థితిని చక్కబెట్టేందుకు యాత్రికులకు దారి చూపేందుకు, తమ ఇళ్లు, మసీదులు, సమాధులు, దర్గాలు, ఇమాంబరాల తలుపులు తెరిచారు స్థానిక ముస్లింలు. ఆ రోజు దాదాపు 25 వేల మందికి ఆశ్రయం కల్పించారు. ఆహారం, టీ, నీరు అందించారు. తొక్కిసలాటలో గాయపడిన వారికి వైద్య సహాయం చేశారు. నఖాన్ కోహ్నా, హిమ్మత్‌గంజ్, ఖుల్దాబాద్ వంటి ప్రాంతాల్లో భండారాలు (సామూహిక విందులు) నిర్వహించారు.

బహదూర్ గంజ్ నివాసి ఇర్షాద్ దైనిక్ భాస్కర్ మీడియాతో తన అనుభవాన్ని ఇలా పంచుకున్నారు. 'నా ఇంటికి వచ్చిన వ్యక్తి నా అతిథి. అతని బాగోగులు పూర్తిగా నేనే చూసుకోవాలి. అది నా బాధ్యత. తొక్కిసలాట తరువాత దారుణమైన పరిస్థితి ఉంది. అందుకే, నేను, నా పొరుగువారు మా ఇళ్ళని, మసీదులని ఆశ్రయం కల్పించేందుకు వీలుగా ఏర్పాటుచేశాం'. అక్కడే సేవా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అప్నా చౌక్ నుంచి వచ్చిన ఉపాధ్యాయుడు మసూద్ అహ్మద్ కూడా ఉన్నారు. ఆయన ఇలా అంటున్నారు. 'ముస్లిములు తమ మతాన్ని పాటిస్తున్నారు. హిందువులు తమ మతాన్ని పాటిస్తున్నారు. ఇక్కడ రెండు మతాలకు చెందిన వారిగా కంటే మనుషులుగా ఉన్న వ్యక్తులనే చూడాలి. ముఖ్యంగా దూర ప్రాంతాల నుంచి



వచ్చిన వారి ప్రాథమిక అవసరాలు తీర్చడం ఎంతైనా అవసరం. అందుకే మేమంతా సమిష్టిగా ఈ నిర్ణయం తీసుకున్నాం' అని చెబుతున్నారు.

మౌనీ అమావాస్య రోజు, ఆ తరువాత ఇలాంటి మత సామరస్య దృశ్యాలు అక్కడ అనేకం కనిపించాయి. ప్రయాగరాజ్‌కి వచ్చే భక్తుల కోసం ముస్లిం వ్యక్తులు హృదయపూర్వక స్వాగతాలు పలికారు. చౌక్ జామా మసీదు వెలుపల, గుమిగూడిన విశ్వాసులు, భక్తులను పూలతో స్వాగతించారు. ముస్లింలు రక్షణ వస్త్రంగా భావించే 'చాదర్'ని యాత్రికుల క్షేమం కోసం ఉంచారు. ప్రేమ, గౌరవం, సోదరభావంతో నిండిపోయిన ఈ సంప్రదాయాలు మతం కంటే మానవత్వం ముఖ్యమని, ఇదే భారతదేశ సంస్కృతి అని చాటిచెబుతున్నాయి.

'... వీరమల్లు' ఘన విజయం ఖాయం

ఎంఎం రత్నం



'పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నేను నిర్మిస్తున్న భారీ చిత్రం 'హరిహర వీరమల్లు' పాన్ ఇండియా స్థాయిలో ఘన విజయం సాధిస్తుంది. ఈ సినిమా ద్వారా పవన్ కళ్యాణ్ అభిమానులతోపాటు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే చిత్రాన్ని ఇవ్వబోతున్నా. చారిత్రాత్మక యోధుడిగా పవన్ నటిస్తున్నారు. ఈ సినిమా ఎపిక్ యాక్షన్ డ్రామాగా నడుస్తుంది. పవన్‌తో నాకు ఎంతో అనుబంధం ఉంది. గతంలో ఖుషి, బంగారం వంటి సినిమాలు వచ్చాయి. ఖుషి సినిమా తెలుగు సినీ పరిశ్రమలో ఎవర్‌గ్రీన్ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. బంగారం సినిమా పవన్‌కళ్యాణ్ అభిమానుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇప్పుడు పవన్‌తో నేను ముచ్చటిగా మూడో సినిమాగా 'హరిహర వీరమల్లు' సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నాం' అని ప్రముఖ నిర్మాత ఎంఎం రత్నం అన్నారు. మంగళవారంనాడు తన పుట్టినరోజు సందర్భంగా ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హరిహర వీరమల్లు సినిమా షూటింగ్‌లో పవన్‌కళ్యాణ్‌తో తాను మాట్లాడుతున్న ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.



7న ఓటీటీలోకి 'గేమ్ ఛేంజర్'

రామ్ చరణ్, శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన 'గేమ్ ఛేంజర్' చిత్రం త్వరలో ఓటీటీలోకి రానుంది. అమెజాన్ ప్రైమ్ వేదికగా ఫిబ్రవరి 7న ఈ మూవీ విడుదల కానుంది. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రం విడుదలైన 30 రోజుల తర్వాత ఓటీటీలో విడుదల చేయాలని డీల్ ఉంది. జనవరి 10న సినిమా రిలీజైంది. అంటే ఇంకా నెలరోజులు కాకముందే ఓటీటీలోకి వచ్చేస్తోంది.

'ఒక పథకం ప్రకారం' 7న విడుదల

'ఒక పథకం ప్రకారం' సినిమా టైటిల్‌కు రెస్పాన్స్ అయితే అద్భుతంగా ఉంది. ఈ సినిమాలో ఉండే ప్రతి పాత్రకు ఎవరి ప్లానింగ్ వారికి ఉంటుంది. అందుకే ఈ టైటిల్‌ను ఎంపిక చేశాం. దర్శకుడు వినోద్‌కుమార్ అన్నిటి మీద అవగాహన ఉన్న మంచి టెక్నీషియన్. ఆయన దర్శక నిర్మాతగా ఫాహద్ ఫాజిల్‌తో రెండు సినిమాలు నిర్మించారు. మా ఇద్దరికీ ఉన్న కామన్ ఫ్రెండ్ వినీత్. వీళ్లిద్దరూ కలిసి తెలుగులో చేద్దామనుకున్నప్పుడు నా పేరును అనుకున్నారు. సముద్రఖని గారితో పనిచేయటం హుందాగా అనిపించింది. ట్రైలర్‌ను అన్నయ్య పూరీ జగన్నాథ్ చూశారు. కొత్తగా ఉందన్నారు. ఈ సినిమాలో నా పాత్ర క్రిమినల్ లాయర్. క్రిమినలా? లేకపోతే క్రిమినల్ లాయరా? అన్నట్లుగా ఉంటుంది' అని కథానాయకుడు సాయిరామ్ శంకర్ అన్నారు. ఆయన నటించిన 'ఒక పథకం ప్రకారం' సినిమా ఈనెల ఏడో తేదీన విడుదల కానుంది. గార్లపాటి రమేష్, వినోద్‌కుమార్ విజయన్ నిర్మించారు. శృతిసోది, ఆషిమా నర్వాల్, సముద్రఖని కీలక పాత్రలు పోషించారు.



ఓటీటీలో 'డార్క్' స్ట్రీమింగ్



కోలీవుడ్‌లో సూపర్‌హిట్ సినిమా 'బ్లాక్' తెలుగు వర్షన్ ఓటీటీలో 'డార్క్' టైటిల్‌తో విడుదలై అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. గతేడాది డిసెంబర్‌లో ఈ సినిమా విడుదలైంది. నటుడు జీవా, నటి ప్రియ భవానీశంకర్ జంటగా నటించారు. ప్రొటాన్షియల్ స్టూడియోస్ పతాకంపై ఎస్ఆర్ ప్రభు, ఎస్ఆర్ ప్రకాష్‌బాబు నిర్మించారు. జికె బాలసుబ్రమణి దర్శకత్వం వహించారు. సైన్స్ ఫిక్షన్ కాన్సెప్ట్‌తోపాటు మంచి థ్రిల్లర్ డ్రామాగా ఈ మూవీని తెరకెక్కించారు.

ఆర్యన్ ఖాన్ కొత్త చిత్రం

'ది బ్యాడస్ ఆఫ్ బాలీవుడ్'

బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ కొడుకు ఆర్యన్ ఖాన్ దర్శకుడిగా ఓ చిత్రం తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టైటిల్‌ని చిత్రబృందం ప్రకటించింది. 'ది బ్యాడస్ ఆఫ్ బాలీవుడ్' పేరుతో ఈ చిత్రం రానుంది. ఈ సినిమాలో షారుఖ్ ఖాన్‌తో పాటు పలువురు అగ్ర నటులు నటించబోతున్నారు. ఇప్పటికే షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ చిత్రం నేరుగా నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేశారు. షారుఖ్, ఆర్యన్ ఇంట్రోతో ఈ టీజర్ ఇంట్రెస్టింగ్‌గా సాగింది. నెట్ ఫ్లిక్స్, రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ సంయుక్తంగా ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు.

28న 'శబ్దం'



ఆది పినిశెట్టి నటిస్తున్న తాజా చిత్రం 'శబ్దం'. 'వైశాలి' ఫేమ్ అరివళిగన్ ఈ సినిమాని తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం రిలీజ్‌కి సిద్ధమైనట్లు తాజాగా మేకర్స్ ప్రకటించారు. విడుదల తేదీని ప్రకటిస్తూ ఆది పినిశెట్టి పోస్టర్‌ను షేర్ చేశారు. ఫిబ్రవరి 28న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో ఈ సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. 7జి ఫిల్మ్స్ శివ, అల్ఫా ఫ్రేమ్స్ బ్యానర్స్‌పై భానుప్రియ, శివ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నారు. మనోజ్ కుమార్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంగా రూపొందుతున్న ఈ చిత్రంలో లక్ష్మీ మీనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హారర్ నేపథ్యంలో వస్తున్న ఆ సినిమాలో సీనియర్ నటి లైలా కూడా ఓ ప్రధాన పాత్రలో కనిపించనున్నారు.

వరుణ్ ఇన్.. బుమ్రా ఔట్..

- ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు జట్టు ప్రకటన



నాగ్‌పూర్: ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారతజట్టును బిసిసిఐ మరోదఫా వెల్లడించింది. గాయపడ్డ జస్ప్రీత్ బుమ్రా స్థానంలో వరుణ్ చక్రవర్తికి చోటు కల్పించింది. అలాగే సీనియర్ పేసర్ మహ్మద్ షమీకి కూడా వన్డే జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇంగ్లండ్‌తో గురువారం నుంచి మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు భారతజట్టు ఆడే చివరి సిరీస్ ఇదే కావడంతో టీమిండియా గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. ఛాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో పెట్టుకొని బిసిసిఐ పేసర్ జస్ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినిచ్చిన బోర్డు.. టి20 సిరీస్‌లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన వరుణ్ చక్రవర్తికి వన్డే జట్టులో చోటు కల్పించడం విశేషం. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో వెన్నునొప్పి గాయంతో ఆటకు దూరమైన బుమ్రా ఛాంపియన్స్ ట్రోఫీ నాటికి ఫిట్‌నెస్ సాధిస్తాడని సమాచారం. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీకి ప్రకటించిన జట్టులో బుమ్రాకు చోటు కల్పించిన సంగతి తెలిసిందే. రెగ్యులర్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టి20ల సిరీస్‌లో 14వికెట్లతో సత్తా చాటాడు. రాజ్‌కోట్ వేదికగా జరిగిన టి20లో ఏకంగా ఐదు వికెట్లు పడగొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా ఎంపికయ్యాడు. నాగ్‌పూర్ వేదికగా మార్చి 6నుంచి ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది. దీంతో వరుణ్ చక్రవర్తి టీమిండియా జట్టు సభ్యులతో కలిసి మంగళవారం ప్రాక్టీస్‌లో నిమగ్నమయ్యాడు. లిస్ట్-ఎ క్రికెట్‌లో వరుణ్ చక్రవర్తి 19.8 స్ట్రయిక్‌రేట్‌తో 59వికెట్లు తీశాడు. విజయ్ హజారే ట్రోఫీలో 12.16సగటుతో 18వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆల్‌రౌండర్లు కాగా.. రెగ్యులర్ స్పిన్నర్ల కోటాలో కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి మాత్రమే ఉన్నారు.

జట్టు: రోహిత్(కెప్టెన్), శుభ్‌మన్, జైస్వాల్, కోహ్లి, శ్రేయస్, కెఎల్ రాహుల్, పంత్(వికెట్ కీపర్), హార్దిక్, జడేజా, సుందర్, అక్షర్, కుల్దీప్, హర్షిత్ రాణా, షమీ, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి.

హాట్‌కేకుల్లా అమ్ముడైన టికెట్లు

భారత్ × పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్

దుబాయ్: భారత్, పాకిస్తాన్ జట్లమధ్య జరిగే క్రికెట్ మజా అంటే వేరు. ఈ రెండు జట్లు తలపడుతున్నాయంటే స్టేడియాలు కిక్కిరిసిపోవాల్సిందే. ఈ క్రమంలోనే ఈనెలలో పాకిస్తాన్ ఆతిథ్యమిచ్చే ఛాంపియన్స్ ట్రోఫీలో ఇరుజట్ల మధ్య జరిగే మ్యాచ్ క్రికెట్ మ్యాచ్ టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడైపోయాయి. ఈ మ్యాచ్ దుబాయి వేదికగా జరుగనుంది. మ్యాచ్ టికెట్ల బుకింగ్ ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే అమ్ముడయ్యాయంటే.. ఎంత భారీ క్రేజ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా భారత్-పాక్ మధ్య గ్రూప్ దశ మ్యాచ్ ఫిబ్రవరి 23న జరుగనుంది. ఛాంపియన్స్ ట్రోఫీలో భారత్ మ్యాచులన్నీ దుబాయిలోనే ఆడనున్న విషయం తెలిసిందే. దుబాయి క్రికెట్ స్టేడియం జనరల్ స్టాండ్ టికెట్ 125 దిర్హామ్స్ (రూ.3వేలు) నుంచి ప్రారంభమైంది. దుబాయిలో జరిగే మొదటి సెమీఫైనల్ మ్యాచ్ తర్వాత ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ టిక్కెట్లు అందుబాటులో ఉంటాయి. ఛాంపియన్స్ ట్రోఫీలో ఎనిమిది జట్లు పాల్గొంటాయి. టోర్నమెంట్ 19 రోజుల పాటు కొనసాగుతుంది. రావల్పిండి, లాహోర్, కరాచీ స్టేడియాల్లో మ్యాచులు జరుగుతాయి. పాకిస్తాన్‌లోని ప్రతి మైదానంలో మూడు గ్రూప్ మ్యాచులు జరుగుతుతాయి. భారత్ ఆడే మూడు గ్రూప్ మ్యాచ్‌లు, మొదటి సెమీఫైనల్ మాత్రం దుబాయిలోనే ఉంటుంది. ఈ ఈవెంట్‌లో టీమిండియా ఫిబ్రవరి 20న తొలి లీగ్ మ్యాచ్ ఆడుతుంది. 23న పాకిస్తాన్‌తో తలపడనుంది. మార్చి 2న చివరి లీగ్ మ్యాచ్ ఆడుతుంది.

తమిళనాడు జట్టులో సాయి సుదర్శన్‌కు చోటు

విదర్భతో రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్



చెన్నై: రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్లో భాగంగా విదర్భతో జరిగే తమిళనాడు జట్టులో సాయి సుదర్శన్‌కు చోటు దక్కింది. నాగ్‌పూర్ వేదికగా ఫిబ్రవరి 8నుంచి ఇరుజట్ల మధ్య రంజీట్రోఫీ క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్ జరగనుంది. సెమీస్ బెర్త్ కోసం ఈ రెండు జట్లు హోరాహోరీగా తలపడనున్నాయి. తమిళనాడు క్రికెట్ అసోసియేషన్(టిఎన్‌సిఎ) ప్రకటించిన 16మంది జట్టులో సాయి సుదర్శన్ ఒకడు. లీగ్ దశలో భాగంగా జరిగిన 6, 7 మ్యాచ్‌లకు సాయి సుదర్శన్ గాయం కారణంగా దూరమయ్యాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అద్భుత ఆటగాడైన సాయి సుదర్శన్ ఈ రంజీట్రోఫీ సీజన్‌లో 295పరుగులతో రాణించాడు. ఇందులో ఒక డబుల్ సెంచరీ కూడా ఉంది. అరుణ్ జైట్లీ స్టేడియంలో ఢిల్లీతో జరిగిన లీగ్ మ్యాచ్‌లో కొట్టాడు. టిఎన్‌సిఎ ప్రకటించిన 16మంది జట్టుకు సాయి కిషోర్ కెప్టెన్‌గా, ఎన్. జగదీశన్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. తమిళనాడు గ్రూప్‌లో 25పాయింట్లతో నాకౌట్‌కు చేరిన సంగతి తెలిసిందే.

తమిళనాడు జట్టు: సాయి కిషోర్(కెప్టెన్), జగదీశన్(వైస్ కెప్టెన్), మహ్మద్ అలీ, సాయి సుదర్శన్, వైష్ణ కుమార్, విజయ్ శంకర్, ఆండ్రీ సిద్ధార్థ్, రంజన్‌పాల్, మహ్మద్, అజిత్ రామ్, సోను యాదవ్, త్రిలోక్ నాగ్, అచ్యుత్, లోకేశ్వర్, ఎం. సిద్ధార్థ్, గోవింద్.

ఆంధ్రకు మరో రెండు కాంస్య పతకాలు

38వ జాతీయ క్రీడలు



డెహ్రాడూన్: 38వ జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్‌కు మరో రెండు కాంస్యపతకాలు దక్కాయి. 7వ రోజు పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్, కనో స్లాలోమ్‌లో ఆంధ్రకు ఈ పతకాలు దక్కాయి. పురుషుల బ్యాడ్మింటన్ డబుల్స్‌లో గౌస్-సాయి పవన్ జోడీ, మహిళల కనో స్లాలోమ్ కేటగిరీలో డి. చేతన భగవతి ఈ పతకాలు సాధించారు. వీరికి ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్విట్టర్(ఎక్స్)లో శుభాకాంక్షలు తెలిపారు. ఈ పతకాలు అథ్లెట్లకు ఇంకా అందజేయలేదు. 7వ రోజు పోటీలు ముగిసే సరికి పతకాల పరంగా కర్ణాటక అథ్లెట్లు సత్తా చాటుతున్నారు. ఏడో రోజైన మంగళవారం పోటీలు ముగిసే సరికి కర్ణాటక 42పతకాలతో మరోసారి టాప్‌లోకి ఎగబాకింది. ఇందులో 22స్వర్ణాలు, 10రజత, 10 కాంస్యాలున్నాయి. రెండోస్థానంలో సర్వీసెస్‌కు 38 పతకాలు దక్కినా..ఇందులో 19 స్వర్ణాలు మాత్రమే ఉన్నాయి. ఇక పతకాల పరంగా 61పతకాలు సాధించిన మహారాష్ట్రకు కేవలం 15 స్వర్ణాలే దక్కడంతో మూడోస్థానంలో కొనసాగుతోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68